తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గద్దం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
16 డిసెంబర్ 2024
సంపుటి : 02
సంచిక : 179
పేజీలు : 12
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna



## దేశ సమగ్రత, సమైక్యతకు పటేల్ కృషి

- సీఎం రేవంత్‌రెడ్డి
- సర్దార్ వల్లభారు పటేల్ చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి పుష్పాంజలి

తరంగాలుహైదరాబాద్
దేశ సమగ్రత, సమైక్యతకు సర్దార్ పటేల్ కృషి చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.భారత తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభారు పటేల్ వర్ధంతి -మిగతా 3 లో



# జమిలి వాయిదా

## అనూహ్యంగా జాబితా నుంచి తొలగింపు

- లోక్‌సభలో చర్చపై మొన్న ప్రకటన నిన్న విరమణ
- అనూహ్యంగా జాబితా నుంచి తొలగింపు
- ఫైనాన్స్ బిల్లులకు ప్రధాన్యం ఇవ్వాలని యోజన
- కేంద్ర వ్యూహంపై ఆరాధిస్తున్న ప్రతిపక్షాలు..
- 20 న ముగియనున్న శీతాకాల సమావేశాలు
- ఆచితూచి అడుగులేస్తున్న మోడీ సర్కార్

న్యూఢిల్లీ తరంగాలు
జమిలీ ఎన్నికలకు సంబంధించి లోక్‌సభలో సోమవారం రెండు బిల్లులు ప్రవేశపెట్టాలని నిర్ణయించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం గంటల వ్యవధిలోనే వెనక్కి తగ్గింది. ఈ వారం చివరలో ఈ బిల్లులు సభ ముందుకు వచ్చే -మిగతా 3 లో



## గ్రూప్ -2 పరీక్షలు ప్రశాంతం

- పేపర్-1లో 46.75, పేపర్-2లో 46.30 శాతం హాజరు
- వికారాబాద్ పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్‌తో చిక్కిన అభ్యర్థి

హైదరాబాద్
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతగా ముగిశాయని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. -మిగతా 3 లో




## అమరజీవిస్ఫూర్తితో సుపరిపాలన

- పొట్టి శ్రీరాములు పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం
- సిఎం చంద్రబాబు నాయుడు

అమరావతి తరంగాలు
అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఐ అండ్‌పిఆర్ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లబారు పటేల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు సిఎం చంద్రబాబునాయుడు, -మిగతా 3 లో



## తిరోగమనం వైపు తెలంగాణ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్‌తరంగాలు
కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో తిరోగమనం వైపు పయనిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో విమర్శించారు. పదేండ్లపాటు కేసీఆర్ పాలనలో అద్భుతంగా పురోగమించిన -మిగతా 3 లో

## కేసీఆర్ పదేండ్ల అప్పులపై

# చర్చకు సిద్ధమా..?



- భూమిలేని పేదలకు రూ.12వేలు
- ఏడాదికి రెండు విడతలుగా అమలు..
- డిసెంబర్ 28న రూ.6వేలు జమ
- జిల్లాలను అనుసంధానిస్తూ రీజినల్ రింగ్ రోడ్డు
- ఉపముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క

తరంగాలు- ఖమ్మం
భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12వేల హామీని ఈనెల 28వ తేదీ నుంచి అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనవనరుల శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఏడాదికి రెండు విడతలుగా ఈ నగదును జమ చేస్తామని తెలిపారు. సంక్రాంతి నుంచి రైతుభరోసా డబ్బులు కూడా ఇస్తామని పునరుద్ఘాటించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి -మిగతా 3 లో



## సిరియాపై ఆంక్షలను ఉపసంహరించండి

ఐరాసలో ప్రత్యేక రాయబారి విజ్ఞప్తి

దమాస్కస్ తరంగాలు
తమ దేశంపై విధించిన ఆంక్షలను ఉపసంహరించుకోవాలని పాశ్చాత్య దేశాలకు ఐరాసలో సిరియా ప్రత్యేక రాయబారి గీర్ ఫెడర్సెన్ ఆదివారం విజ్ఞప్తి చేశారు. దేశంలో బషర్ అసాద్ పాలన ముగిసిన నేపథ్యంలో -మిగతా 3 లో

## నేటి నుంచి మళ్లీ అసెంబ్లీ

- వారంరోజులు కొనసాగే అవకాశం
- నేడు బీఏసీలో నిర్ణయం
- మధ్యాహ్నం 2 గంటలకు క్యాబినెట్

హైదరాబాద్
అసెంబ్లీ సమావేశాలు మళ్లీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 9న అసెంబ్లీ సమావేశాల్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆరోజు కొన్ని బిల్లుల్ని -మిగతా 3 లో



# భారత్ చేరుకున్న దిసనాయకే



న్యూఢిల్లీ తరంగాలు

భారత్‌లో మూడు రోజుల పర్యటన కోసం ఆదివారం న్యూఢిల్లీకి శ్రీలంక అధ్యక్షులు అనుర కుమార దిసనాయకే చేరుకున్నారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎస్ మురుగన్, దౌత్య అధికారులు దిసనాయకేకు స్వాగతం పలికారు. సెప్టెంబరులో అధ్యక్షులుగా ఎన్నికైన తరువాత దిసనాయకేకు ఇదే మొదటి విదేశీ పర్యటన. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆహ్వానం మేరకు ఈ పర్యటనకు వచ్చారు. భారత్‌తో దౌత్య సంబంధాలను మరింత బలపర్చడం, ఇరు దేశాల వివిధ రంగాల్లో సహకారాన్ని విస్తరించడం ప్రధాన లక్ష్యంగా ఈ పర్యటన సాగనుందని శ్రీలంక అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో దిసనాయకే మధ్య చర్చలు జరిగాయి.

# అమెరికా, చైనా మధ్య శాస్త్రీయ సహకార ఒప్పందం పునరుద్ధరణ




బీజింగ్‌తరంగాలు

అమెరికా, చైనాలు తమ మధ్య శాస్త్రీయ, సాంకేతిక సహకార ఒప్పందాన్ని మరో ఐదేళ్ల పాటు పునరుద్ధరించుకున్నాయి. ఇరు దేశాల మధ్య తీవ్రమైన ఆర్థిక, రాజకీయ ఘర్షణ వాతావరణం నెలకొందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ ఒప్పందం పునరుద్ధరణతో వాటిని ఖండించినట్లయింది. అయితే ఈ ఒప్పందంపై తొలిసారిగా 1979లో ఇరు దేశాలు సంతకం చేశాయి. తరువాత నుంచి ప్రతీ ఐదేళ్లకు ఈ దీన్ని పునరుద్ధరిస్తున్నారు. గగన తలంపై బెలూన్ కాల్చివేత, తైవాన్ అధ్యక్షులు-అమెరికా స్పీకర్ మధ్య భేటీ వంటి సందర్భాల్లోనూ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించారు. శాస్త్రీయ పరిశోధనలు, వాతావరణ మార్పులు, ఫెంటానిల్ అక్రమ రవాణా, సింథటిక్ డ్రగ్ వంటి విస్తృత రంగాల్లో అమెరికా, చైనా మధ్య సహకారం కోసం ఈ ఒప్పందం కుది రింది. పునరుద్ధరించిన తాజా ఒప్పం దంలో భద్రత, వివాదాల పరిష్కా రానికి సంబంధించిన నిబంధనలను బలోపేతం చేసినట్లు, అలాగే మేథో సంపత్తిని రక్షించే నిబంధనలను జత చేసినట్లు అధికారులు తెలిపారు.

# సంభాల్‌లో దేవాలయాన్ని తెరిచిన అధికారులు

### మత ఘర్షణల నేపథ్యంలో 1978 నుండి దానికి తాళం



లక్నో తరంగాలు

ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ పట్టణంలో 1978 నుండి మూసి ఉన్న భస్మ శంకర్ దేవాలయాన్ని అధికారులు తెరిచారు. షాహీ జామా మసీదు సమీపంలో ఉన్న ఈ దేవాలయాన్ని ఆక్రమణల తొలగింపు సందర్భంగా గుర్తించి దానికి వేసి ఉన్న తాళాన్ని తీశారు. దేవాలయంలో హనుమంతుడి విగ్రహం, శివలింగం ఉన్నాయి. సంభాల్ పట్టణంలో 1978లో మత ఘర్షణలు చెలరేగడంతో దేవాలయాన్ని మూసేసి తాళం వేశారు. కాగా నాటి ఘర్షణల కారణంగా హిందూ సమాజానికి చెందిన స్థానికులు నిరాశ్రయులయ్యారని స్థానికులు చెప్పారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న విద్యుత్ చౌర్యానికి వ్యతిరేకంగా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ వందనా మిశ్రా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ప్రచారం నిర్వహిస్తుండగా దేవాలయానికి తాళం వేసి ఉండడాన్ని గమనించారు. 'మూతపడిన దేవాలయాన్ని గుర్తించగానే వెంటనే జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చాను. దేవాలయాన్ని తిరిగి తెరవాలని మేమంతా నిర్ణయించాం' అని చెప్పారు. దేవాలయానికి సమీపంలో ఉన్న బావిని కూడా తిరిగి వాడకంలోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. 'మత ఘర్షణలు జరిగిన తర్వాత దేవాలయాన్ని మూసేశారు. మేమంతా నిరాశ్రయులమై వలస పోయాము. మా కుల గురువుకు అంకితం చేసిన దేవాలయం అప్పటి నుండీ మూతపడే ఉంది' అని నగర హిందూ మహాసభకు చెందిన విష్ణు శంకర్ రస్తోగీ తెలిపారు.

# అబద్ధాలు, అసత్యాలు మానుకోవాలి

- లేకపోతే ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం
- అడ్డూ అదుపులేని అవినీతి పాలన మీది
-ఏడాదిలోనే అద్భుత పాలన కాంగ్రెస్‌ది : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లేఖ




హైదరాబాద్‌తరంగాలు

బీఆర్ఎస్ పార్టీ నేతలు, కేసీఆర్ కుటుంబసభ్యులు కాంగ్రెస్ పాలనపై అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కోరారు. లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు లేఖ రాశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన అడ్డూ అదుపు లేని అవినీతితో కూడుకున్నదనీ, ఏడాది కాంగ్రెస్ పాలన అద్భుతంగా ప్రజలకు సేవలందించిందని వివరించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ వెనుకబడిందని ఆరోపించారు. దళిత ముఖ్యమంత్రి హామీని అమలు చేయకుండా సీఎంగా అందలమెక్కి మొదటి రోజు నుంచే వంచనకు పాల్పడ్డారని వివరించారు. కోర్టుల్లో కేసులు వేయించి బీఆర్ఎస్ ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని తెలిపారు. అన్ని రకాల పోటీ పరీక్షలు అవకతవకలు, గందరగోళమే చేశారని తెలిపారు. కాంగ్రెస్ తొలి ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 54 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టునునాణ్యతా లోపంతో నిర్మించి, దాని మనుగడకే ప్రమాదం తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని కింద మూడు బ్యారేజీలు పని చేయకపోయినా ఈ ఖరీఫ్ సీజన్లో 66.76 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసేలా సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే ఆ అప్పును రూ.7 లక్షల కోట్లకు పెంచారని వివరించారు. లక్షలాది మంది రైతుల రుణమాఫీని బీఆర్ఎస్ ఎగ్గొడితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షలలోపు రుణాలను మొత్తం రూ.21 వేల కోట్లు మాఫీ చేసి 25 లక్షల మంది రైతులకు సహాయపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో పంట బీమా లేకపోవడంతో రైతులు నష్టపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం 42 లక్షల మంది రైతులకు బీమా కవరేజీ కోసం రూ.1,433.33 కోట్ల ప్రీమియం చెల్లించిందని వివరించారు. కాంగ్రెస్ అధికారికంగా రూపొందించిన విగ్రహంపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదమని కొట్టిపారేశారు.

అసెంబ్లీకి రండి

సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న కేసీఆర్ ఫాంహౌజ్‌కే ఎందుకు పరిమితమయ్యారని ప్రజలు ప్రశ్నిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి రాష్ట్ర ప్రగతికి సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుందని సూచించారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
-సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తాం : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
-వికారాబాద్ జిల్లాలో మంత్రుల పర్యటన



తరంగాలు-పరిగి,

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లాలో పర్యటించిన మంత్రులు.. పరిగి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పరిగి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా పరశురామ్ రెడ్డితోపాటు పాలక మండలి సభ్యులు, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా బీఎస్ ఆంజనేయులు ముదిరాజ్‌తోపాటు పాలకవర్గ సభ్యులు మంత్రుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కుల్కచర్ల మండలంలోని బండవెల్కిచెర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికీ మంత్రులు హాజరయ్యారు. అలాగే పరిగి పట్టణకేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సీఎం కప్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశాల్లో మంత్రులు మాట్లాడారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒకదాని వెంబడి ఒకటి అమలు చేస్తున్నామని అన్నారు. రైతు కూలీలకు ఇచ్చిన హామీలు కూడా తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. ఏకకాలంలో రుణమాఫీ చేశామని, త్వరలోనే రైతు భరోసా రైతుల ఖాతాలో జమవుతుందని తెలిపారు. ఆర్టికల్చర్‌తోపాటు ఆయిల్ ఫామ్ మీద కూడా దృష్టి పెట్టినట్టు చెప్పారు. రైతులు వ్యవసాయం చేయడంతో పాటు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. శీతల గిడ్డంగులను నిర్మించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా పండించిన పంటలను హౌల్ సేల్ మార్కెట్‌లో విక్రయించేందుకు కోహిడ వద్ద మార్కెట్‌ను సన్నద్ధం చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాకు ట్రిబుల్ ఆర్ రోడ్డు రావడం వల్ల భూములకు భారీగా డిమాండ్ పెరుగుతుందని, కాబట్టి రైతులెవరూ భూములను అమ్ముకోకూడదని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వ్యవసాయ శాస్త్రవేత్తలుగా రైతన్నలు ఉన్నారని, కందులకు తాండూర్ ఫేమస్ అని అన్నారు. పంటల మార్పిడి కూడా అవసరమని అన్నారు. మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో రైతులే రాజులు, మహిళలే మహారాణులని అన్నారు. అందరి సహకారంతో ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ముందుకు సాగుతుందని తెలిపారు. ఛీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు, రైల్వే లైన్ పరిగికి తీసుకువచ్చే క్రమంలో గత ప్రభుత్వం రాకుండా అడ్డుకుందన్నారు. ఇప్పుడు రైల్వే ప్రాజెక్టు సంబంధించి సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

# తబలా మాస్ట్రో ఇక లేరు

-శాన్‌ఫ్రాన్సిస్కోలో అనారోగ్యంతో
-జాకీర్ హుస్సేన్ కన్నుమూత



న్యూఢిల్లీ తరంగాలు

ప్రముఖ తబలా వాయిద్యకారుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ (73) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. హృదయ సంబంధిత సమస్యలతో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో గల ఒక ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో ఐసీయూలో చికిత్స అందించారు. అయితే, పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి ఆయన తుది శ్వాస విడిచారు. జాకీర్ హుస్సేన్ మరణంతో దేశ, విదేశాల్లోని సంగీత అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. జాకీర్ హుస్సేన్ 1951, మార్చి 9న ముంబయిలోని మహిమ్‌లో తబలా విద్వాంసుడు అల్లా రఖా, బావి బేగం దంపతులకు జన్మించారు. జాకీర్ చిన్నప్పటి నుంచే సంగీతంలో చక్కని ప్రతిభను కనబరిచాడు. మూడేండ్ల వయసు నుంచే తన తండ్రి మార్గదర్శకత్వంలో మృదంగం శిక్షణ పొందాడు. 12 ఏండ్లు వచ్చేసరికి కచేరీ ప్రదర్శనలు జరిపారు. ఆ తర్వాత కొన్నేండ్లలో ఆయన ప్రపంచస్థాయిలో ఎదిగారు. ప్రపంచంలో ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్‌ను ప్రమోట్ చేయటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. పద్మభూషణ్, పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ వంటి ప్రతిష్టాత్మక అవార్డులను ఆయన అందుకున్నారు. 2024లో 66వ గ్రామీ అవార్డులలో సింగిల్ నైట్‌లో మూడు అవార్డులు పొందిన తొలి భారతీయుడిగా ఆయన చరిత్ర సృష్టించారు. జాకీర్ హుస్సేన్ మరణంతో సంగీత ప్రపంచం మూగబోయింది. ఇండియన్ క్లాసిక్ మ్యూజిక్ ప్రపంచంలో ఒక శకం ముగిసిందని అభిమానులు బాధను వ్యక్తం చేస్తున్నారు. జాకీర్ హుస్సేన్ మృతి పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆయన అభిమానులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయటం కనిపించింది.

తరంగాలు
Tharangalu Daily News Paper
RNI. TELTEL / 2022 / 83463

# జమిలి వాయిదా

(మొదటి తరువాయి)

అవకాశం ఉన్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇతర కార్యక్రమాలు చేపట్టడానికి ముందు గ్రాంట్లకు సంబంధించిన తొలి అనుబంధ డిమాండ్లకు సభ ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నదని ఆ వర్గాలు వివరించాయి. ఈ నెల 20న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగుస్తాయి. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనను అనేక ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. బిల్లులను ప్రవేశపెట్టే దశలోనే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయాలని ఆ పార్టీలు యోచిస్తున్నాయి. సోమవారం చేపట్టబోయే సభా కార్యక్రమాలను లోక్‌సభ వెబ్‌సైటులో ప్రచురించారు. దీని ప్రకారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లును, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లును సభలో ప్రవేశపెట్టాల్సి ఉంది. జమిలీ ఎన్నికల నిర్వహణకు వీలుగా ఈ రెండు



బిల్లులను రూపొందించారు. అయితే ఆశ్చర్యకరంగా కొన్ని గంటల వ్యవధిలోనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. దిగువ సభ వెబ్‌సైటులో సవరించిన సభా కార్యక్రమాలను పోస్ట్ చేశారు. తొలుత ప్రచురించిన కార్యకలాపాల జాబితా ఉండి ఈ రెండు బిల్లులను తొలగించారు. బిల్లులను ముందుగా సభలో ప్రవేశపెట్టి, ఆ తర్వాత సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపుతారని తొలుత వార్తలు వచ్చాయి. సభలో చేపట్టే కార్యక్రమాల నుండి ఈ రెండు బిల్లులను తొలగించినప్పటికీ నిబంధనల ప్రకారం అనుబంధ జాబితా ద్వారా వాటిని ప్రభుత్వం సోమవారం సభలో ప్రవేశపెట్టవచ్చు.

# అమరజీవి స్ఫూర్తితో సుపరిపాలన

(మొదటి తరువాయి)

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా "ఆత్మార్పణం" పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర సంక్షేమం, అభివృద్ధి సాధ్యమౌతుందని చెప్పారు. తెలుగు ప్రజలు గర్వంగా చెప్పుకునే వ్యక్తి పొట్టి శ్రీరాములు అని అన్నారు. చాలా కొద్ది మందే జాతికోసం ఆలోచిస్తారని, ఇదే కోవలో తెలుగుజాతి కోసం ఆలోచించి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని చెప్పారు. సంకల్పసిద్ధి కోసం త్యాగం చేసిన ఏకైక నాయకుడని ఆయన నివాళులర్పించారు. త్వరలోనే రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. అమరజీవి పుట్టిన ఊరితో పాటు అమరావతిలో స్మారకాన్ని అభివృద్ధి చేస్తామని




సిఎం ప్రకటించారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తా మన్నారు. ఇటువంటి ఎందరో మహనీయుల స్ఫూర్తితోనే 'స్వర్ణాంధ్ర విజన్ -2047' తీసుకొచ్చామని చెప్పారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర జాతికి నాయకుడన్నారు. రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మార్పణ గావించిన అమరజీవి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, ప్రభుత్వ విప్ బోండా ఉమా మహేశ్వరరావు, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకటరావు, శ్రీరాం రాజగోపాల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభ అనంతరం పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులను శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు.

# కేసీఆర్ పదేండ్ల అప్పులపై చర్చకు సిద్ధమా..?

(మొదటి తరువాయి)

మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యవసాయానికి నేరుగా రూ.50,953 కోట్లు ఖర్చు చేసిందన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒరగబెట్టిందేమీ లేదని తెలిపారు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు భ్రమలు కల్పించి ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. అప్పులపై ప్రజలను పక్కదోవ పట్టిస్తోందని, బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో చేసిన అప్పులపై తమ దగ్గర పక్కా లెక్కలు ఉన్నాయని స్పష్టంచేశారు.

**కేసీఆర్ పదేండ్లలో చేసిన అప్పులపై చర్చకు సిద్ధమా..?**

కేసీఆర్ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో చేసిన అప్పులపై చర్చకు సిద్ధమా.. అని భట్టి ప్రశ్నించారు. రాష్ట్రప్రభుత్వం బ్యాంకులకు 2014 నాటికి చెల్లించాల్సిన అప్పు రూ.6,400 కోట్లు ఉండగా, పదేండ్లలో ఆ అప్పుల వల్ల ఏడాదికి రూ.66,782 కోట్లు వడ్డీ చెల్లించాల్సిన దుస్థితికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకెళ్లిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులకు తాము వడ్డీలు కడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ఇప్పటివరకు రూ.54వేల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. ఈ లెక్కలపై అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. నీటిపారుదల,



ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆస్పత్రులు, ఉద్యోగుల జీపీఎఫ్, ఫీజు రీయింబర్స్‌మెంట్, మధ్యాహ్న భోజనం తదితర శాఖలకు రూ.40,154 కోట్లు బకాయిలు పడిందన్నారు. పదేండ్లలో ప్రత్యక్ష, పరోక్షంగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7,11,911 కోట్లు అప్పులు చేసి ప్రజలపై భారం మోపిందన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు ఆ పార్టీ నేతలు తినడానికైతే.. కాంగ్రెస్ చేసిన అప్పులు ఆ వడ్డీలు కట్టడానికి అని స్పష్టం చేశారు. పది నెలల్లో రూ.66,722 కోట్ల అప్పులు కట్టామన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం సన్నవడ్లు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. ఈ బోనస్ ద్వారా ప్రతి ఎకరాకు రూ.10నుంచి రూ.15వేల వరకు రైతులు లబ్ది పొందుతున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందన్నారు. రూ.21వేల కోట్ల రుణమాఫీ ఒక్క ఏడాదిలోనే చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్ విద్యార్థులకు కామన్ మెనూ అమలు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల విస్తరణ కోసం కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తలమానికంగా మూసీని అభివృద్ధి చేయడానికి మూసీ పునరుజ్జీవ కార్యక్రమం చేపట్టామన్నారు. అలాగే, అన్ని జిల్లాలనూ కలుపుతూ రీజనల్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు, రీజనల్ రింగ్‌రోడ్డు మధ్య ఇండిస్టియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్తు త

# సిరియాపై ఆంక్షలను ఉపసంహరించండి

' (మొదటి తరువాయి)

ఆంక్షలను అతి త్వరలోనే ఎత్తివేస్తారని కోరుకుంటున్నాం. తద్వారా సిరియా నిర్మాణాన్ని చేపట్టగలం' అని ఆదివారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో గీర్ ఫెడర్సెన్ తెలిపారు. అస్సాద్ ప్రభుత్వం నేలకూలిన తరువాత ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వంతో సమావేశం కోసం దమాస్కస్‌కు గీర్ ఫెడర్సెన్ వచ్చారు. తొలిసారిగా స్వదేశం వచ్చిన నేపథ్యంలో గీర్ ఫెడర్సెన్ విలేకరులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తమదేశస్థులంతా రాజకీయంగా ఐక్యంగా ఉండి అభివృద్ధిలో పంచుకుంటారని చెప్పారు. అలాగే యుద్ధ సమయంలో జరిగిన నేరాల్లో బాధితులకు న్యాయం, జవాబుదారీతనం ఉండాలని పిలుపునిచ్చారు. సిరియాకు మానవతావాద సహాయాన్ని వేగవంతం చేయాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. అంతర్యుద్ధం, తిరుగుబాటు వంటి కారణాలతో 2011 నుంచి సిరియాపై అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇతర దేశాలు కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నాయి.

# దేశ సమగ్రత, సమైక్యతకు పటేల్ కృషి

(మొదటి తరువాయి)

సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. పటేల్‌కు నివాళులు అర్పించిన వారిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు.

# గ్రూప్ -2 పరీక్షలు ప్రశాంతం

(మొదటి తరువాయి)

పేపర్-1లో జనరల్ స్టడీస్, ఎబిలిటీస్, పేపర్-2లో చరిత్ర, రాజకీయాలు, సమాజం పాఠ్యాంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 5,51,855 మంది పరీక్షకు ధరఖాస్తు చేసుకోగా తొలి రోజు నిర్వహించిన పేపర్-1లో 2,57,981 మంది, పేపర్-2లో 2,55,490 అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. కాగా పేపర్-1లో 46.75, పేపర్-2లో 46.30 శాతం హాజరు నమోదైందని పేర్కొన్నారు. కాగా వికారాబాద్ పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్‌తో అభ్యర్థి చిక్కాడు.

# తిరోగమనం వైపు తెలంగాణ

(మొదటి తరువాయి)

రాష్ట్రం.. నేడు అవినీతి, అసమర్థ పాలనతో అభివృద్ధిలో వెనకబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి రవాణా శాఖ ఆదాయాన్ని ఒక ప్రధాన సూచీ అని కేటీఆర్ పేర్కొన్నారు. "ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాదు ఇతర భారీ వాహనాల అమ్మకాలు జరుగుతాయి. వాహనాల రిజిస్ట్రేషన్లు వృద్ధిని చూపిస్తాయి. కానీ తెలంగాణలో రిజిస్ట్రేషన్లు తగ్గి ఆదాయానికి గండిపడుతోంది. పొరుగున ఉన్న ఐదు రాష్ట్రాలు ఈ ఏడాది రవాణాశాఖ ఆదాయంలో 8 నుంచి 32 శాతం వృద్ధి నమోదు చేయగా, తెలంగాణ మాత్రం గతేడాది కంటే తక్కువ వృద్ధి నమోదు చేసింది. పాలన గాలికొదిలేసి.. కక్ష సాధింపు చర్యలకే సమయాన్ని కేటాయించడతో అభివృద్ధిలో రాష్ట్రం వెనకబడుతోంది" అని కేటీఆర్ విమర్శించారు.

# నేటి నుంచి మళ్లీ అసెంబ్లీ

(మొదటి తరువాయి)

అసెంబ్లీ సమావేశాలు మళ్లీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 9న అసెంబ్లీ సమావేశాల్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆరోజు కొన్ని బిల్లుల్ని శాసనసభలో ప్రవేశపెట్టి, సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఆమెకు ధన్యవాదాలు తెలిపి, సభను ఈనెల 16వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. 9వ తేదీనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సచివాలయ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మళ్లీ వారం తర్వాత శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం పది గంటలకు ప్రశ్నోత్తరాలతో సమావేశాలు ప్రారంభమవుతాయని శాసనసభ కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహాచార్యులు తెలిపారు. ప్రభుత్వం ఈనెల 9న ఐదు ఆర్డినెన్సుల్ని సభలో ప్రవేశపెట్టింది. వాటిలో 2024 తెలంగాణ జీతాలు, ఫించను చెల్లింపు, అనర్హతల తొలగింపు (సవరణ) ఆర్డినెన్స్, పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్, హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (సవరణ) ఆర్డినెన్స్, వస్తుసేవల పన్ను ఆర్డినెన్స్, పంచాయతీరాజ్ (సవరణ) ఆర్డినెన్సులు ఉన్నాయి. అలాగే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 2022-23 ఆర్థిక సంవత్సర తెలంగాణ విద్యుత్ ఆర్థిక సంస్థ 9వ వార్షిక నివేదిక ప్రతిని కూడా సభలో ప్రవేశపెట్టారు. అలాగే సోమవారం జరిగే ప్రశ్నోత్తరాల్లో గ్రామ పంచాయతీల్లో బీటీ రోడ్ల నిర్మాణం, మున్సిపాల్టీల్లో పారిశుద్ధ్య కార్మికుల క్రమబద్ధీకరణ, గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపు, ముదిరెడ్డిపల్లి చెరువులో నీటి కాలుష్యం, నూతన పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, పర్యాటకానికి ప్రోత్సాహం, ఉస్మానియా యూనివర్సిటీలో బీఈ విద్యార్థుల డిటెన్షన్, బెల్ట్‌షాపుల మూసివేత, ఐవీఎఫ్ కేంద్రాలు, జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలపై సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు చెప్తారు. అలాగే ఆర్ఓఆర్ సవరణ చట్టంపై కూడా ఈ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరగనున్నది.

# ఉద్దేశపూర్వకంగా కొట్టలేదు..

మోహన్‌బాబు



హైదరాబాద్: జల్‌పల్లిలోని తన నివాసం వద్ద జరిగిన ఘటనపై నటుడు మోహన్‌బాబు మరోసారి స్పందించారు. తాను ఉద్దేశపూర్వకంగా మీడియా ప్రతినిధిని కొట్టలేదని వివరణ ఇచ్చారు. జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పారు. ఆదివారం సాయంత్రం సోమాజిగూడ యశోద ఆస్పత్రికి వెళ్లి.. చికిత్స పొందుతున్న జర్నలిస్టును మోహన్‌బాబు, మంచు విష్ణు పరామర్శించారు. ఈ సందర్భంగా అతని కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పారు. జల్‌పల్లిలో సినీనటుడు మోహన్‌బాబు నివాసం వద్ద మంగళవారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణ అదనపు డీజీపీని కలిసిన అనంతరం మనోజ్ ..మోహన్‌బాబు నివాసానికి చేరుకోగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. భద్రతా సిబ్బంది గేట్లు తీయకపోవడంతో మనోజ్ అక్కడి భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గేట్లు తోసుకొని లోపలికి దూసుకెళ్లారు. ఆయనతో పాటు అక్కడ ఉన్న మీడియా సిబ్బంది కూడా మోహన్‌బాబు ఇంట్లోకి వెళ్లారు. ఈ ఉద్రిక్తతల నడుమ మోహన్‌బాబు తీవ్ర అసహనానికి గురయ్యారు. అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కొందరు ప్రతినిధులపై ఆయన చేయి చేసుకున్నారు. దీంతో ఆ జర్నలిస్ట్‌కు గాయమైంది.

## సంపాదకీయం

# కేరళ స్కూళ్లు చైతన్య కేంద్రాలు

పాఠశాలలంటే? ఎత్తైన భవనాలు, చుట్టూ ప్రహరీ గోడలు, ఖరీదైన స్కూల్ యూనిఫామ్‌లు కాదు. మానవ జీవితాలను తీర్చిదిద్ది, జాతి భవితను రూపొందించే జీవన నిలయాలు, చైతన్య కేంద్రాలు. మానవీయ విలువల్ని పాదుకొలిపే ఆధునిక దేవాలయాలు. అలాంటి విద్యా విధానాన్ని కేరళలో ప్రత్యక్షంగా అధ్యయనం చేశాం. అక్టోబర్ 30, 31న కోజికోడ్‌లో కేరళ బాలల సంఘం 7వ రాష్ట్ర మహాసభల సందర్భంగా సౌహార్ద సందేశకులుగా పాల్గొన్నాం. అక్కడ చదువులే కాదు. ఆటపాటలతో పాటు జీవిత పాఠాలనూ నేర్పుతారు. తరగతి గదుల్లోనే నిజమైన పౌరులను తీర్చిదిద్దుతున్నారు. మంచి వాతావరణం, సారవంతమైన నేలలో నాణ్యమైన విత్తనాలు విత్తితేనే, చక్కటి ఫలాలనిచ్చే వృక్షాలుగా ఎదుగుతాయి. తల్లిని నేల/నీరుగా.. తండ్రిని విత్తనంగా భావిస్తే.. ఉపాధ్యాయుడు సూర్యరశ్మి లాంటివాడు. వీరు ముగ్గురు మాత్రమే చిన్నారులను మంచి పౌరులుగా మలచగలుగుతారు. ఈ ముగ్గురి భాగస్వామ్యంతో నడుస్తున్నదే కేరళ విద్యా వ్యవస్థ. మనిషి తత్వం, ప్రేమతత్వం, సోదరత్వం తోటి వారికి తోడ్పడాలన్న దృఢ సంకల్పంతో ఏర్పడినదే కేరళ బాలల సంఘం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, జాతీయోద్యమ స్ఫూర్తితో కుల, మత, ప్రాంత, భాష లింగ వివక్ష లేని ప్రపంచ శాంతి, ప్రకృతి పర్యావరణ ఎజెండాగా, ఉచిత ఆహారం, బస్సు సౌకర్యం, సంపూర్ణ అక్షరాస్యత దిశగా%ో% బాలల హక్కుల్ని వివరిస్తూ అడుగులు వేసింది. పల్లెల్లో ఉన్న ప్రతి పిల్లవాడికి భరోసా అయ్యింది. బాలల సంఘం కేరళ మొత్తం విస్తరించింది. 14 జిల్లాలలో 210 ప్రాంతాలలో 2,279 గ్రామాలలో 31,258 యూనిట్లలో 13 లక్షల మంది బాలలతో విస్తరించింది.

గౌతమ బుద్ధుని నుండి మహాత్మా గాంధీ వరకు మాంటిస్సోరి నుండి గిజూబాయి వరకు ఎందరో మహనీయుల బాటలో బాలబాలికలను తీర్చిదిద్దుతున్నారు. అక్కడ పెద్దలు పిల్లలతో స్నేహం చేస్తారు. పిల్లలు చెప్పింది శ్రద్ధగా వింటారు. పిల్లల అభిప్రాయాలను తల్లిదండ్రులు, పెద్దలు ఆలకించే సాంప్రదాయం వారి సంస్కృతిలోనే ఉంది. ఆంగ్ల భాషతో పాటు అన్య భాషలు ఎన్ని నేర్చినా.. పాలనలో బోధనలో మాతృభాషపై మమకారం తగ్గలేదు.

**విద్యపై విజన్**

విద్యపై చేసే ఖర్చులను భావితరాల భవిష్యత్తుకు పునాదిగా చూస్తున్నది కేరళ వామపక్ష ప్రభుత్వం. బడిని బాగు చేయడాన్ని రేపటి పెట్టుబడిగా గుర్తించింది. చదువుల విప్లవం తెచ్చింది. బాల కార్మిక రహిత రాష్ట్రంగా బాల కార్మికుల అక్రమ రవాణాపై పోరాడేందుకు బాలల సంరక్షణ యూనిట్‌ను ఏర్పరిచింది. అక్రమ రవాణా, పిల్లల యాచన, అర్ధాంతరంగా చదువు ఆపేసిన విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిం చింది. డ్రాపౌట్లు లేకుండా చూసే బాధ్యత చైల్డ్ హెల్ప్ డెస్క్ రెస్క్యూ ఫోర్స్ సహాయం సమన్వయంతో అధికారులు 24 గంటలు షిఫ్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. కార్మికుల జాడ కోసం వారానికి మూడు రోజులు తనిఖీలు నిర్వహిస్తారు. బాల కార్మికులు కనిపిస్తే విడిపించి యాజమాన్యాలపై కేసులు పెడతారు. పిల్లలు పనిలో కాదు. బడిలో ఉండాలి. బడికి రాని పిల్లలందరూ బాల కార్మికులే. బాల్యం ఒక హక్కు. పిల్లల చదువుల ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించి, కేరళ సమాజాన్ని ఒప్పించి "బాల్యం బడిలోనే" ఉండాలని తీర్మానం చేశారు. పాఠశాల మాత్రమే పిల్లలను పట్టించుకునే ఏకైక సంస్థగా గుర్తించింది. పిల్లల సర్వతోముఖ వికాసానికి తగినట్టుగా పాఠశాలలను అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. చదువుతోపాటు ఆటపాటలు, ఆట స్థలాలు లేని స్కూళ్లకు అనుమతులుండవు. ప్రతి పాఠశాలలో పి.ఇ.టి, డ్రామా, స్క్రిప్ట్, డాన్స్ టీచర్ తప్పకుండా ఉండాలి. ఆధునిక విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. వీటికి సంబంధించిన శిక్షణ తరగతులు, ప్రణాళిక ప్రతి బిడ్డకు ఉపయోగపడేలా చూస్తారు. సమాజం భాగస్వామ్యం కాకుండా కేవలం ప్రభుత్వ కృషి ఫలితాలివ్వదు. అందుకే అన్ని రంగాల్లో ప్రజల భాగస్వామ్యంతోనే ప్రణాళికలు అమలు జరుగుతాయి. విద్యార్థులు ఫెయిల్ అయితే ఉపాధ్యాయులే ఫెయిల్, విద్యా విధానం ఫెయిల్ అయినట్టుగా చూస్తారు. పిల్లల మనోధైర్యానికి మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తారు. ప్రాచీన నృత్యాలలో శిక్షణ ఇస్తారు. అర్థం కాని పాఠ్యాంశాలను కళారూపాల ద్వారా మనసులో నాటుకునేలా చెప్తారు. దాంతో ఆటపాటలు చిన్నారుల నిత్య జీవితంలో భాగమైనాయి. 'సమగ్ర' అనే పోర్టల్ ద్వారా కేరళ విద్యాశాఖ వెయ్యికి పైగా ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ పాఠశాలలుగా మార్చి 45 వేల స్మార్ట్ రూములను నిర్మించింది. లిటిల్ కైట్స్, ఐ.టి క్లబ్బులను ఏర్పాటు చేసి యూనిమేషన్, షార్ట్ ఫిలిమ్స్, సైబర్ భద్రత వంటి అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనంలో గుడ్డు, వారానికి ఒకరోజు చికెన్ పెడతారు. 3 వేల మంది పిల్లలు ఒకేసారి కలిసి భోజనం చేసే డైనింగ్ హాల్, పేరెంట్స్ విజిటింగ్ హాల్, పెద్ద కిచెన్ వుంటాయి. పరిశుభ్రత విషయంలో పక్కాగా వుంటారు. స్కూల్ ఆవరణలో ఒక ఆకు పడ్డా విద్యార్థులే ఏరి చెత్త బుట్టలో వేస్తారు. ప్రతి స్కూల్లో ఇండోర్ స్టేడియం వుంటుంది. విద్య ఒకటే కాదు. ఏ విద్యార్థికి ఏ రంగంలో ఆసక్తి ఉంటే ఆ రంగంలో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించగలిగేలా శిక్షణనిస్తారు. ఒక మాటలో చెప్పాలంటే? ఒక నిరుపేద విద్యార్థికి అంతర్జాతీయ స్థాయి విద్య ఉచితంగా అందుతుంది.

**భవితకు బలం బాలల సంఘాలే**

పిల్లల సాంస్కృతిక ఉత్సవాలు 'వేనలుంబికల్' (వీధి నాటకాలు) ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో జరుగుతాయి. నాలుగు వేల మంది బాల కళాకారులు 210 బృందాలుగా బాలల సామాజిక సమస్యలపై లక్షలాది మందితో ప్రదర్శనలిచ్చి పెద్దలలో సైతం చైతన్యం కల్పిస్తారు. ఆటపాటల్లో సత్తా చాటుతున్న వారిని చిన్న వయస్సులోనే చేరదీసి ప్రోత్సహిస్తున్నారు. శిక్షణలిచ్చి విశ్వ క్రీడల్లో విజేతలుగా నిలబెడుతున్నారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులను శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నారు.

మలయాళంలో బాల సాహిత్య అకాడమీ ఏర్పరిచారు. బాలల రచనలు, ముద్రణలు అక్కడి నుంచి వెలువడతాయి. ప్రతి ఇంట్లో లైబ్రరీ క్యాంపెయిన్ నిర్వహించి పఠనాసక్తిని పెంచుతారు. బాలల కార్యక్రమంలో కుటుంబాలు, పెద్దలు పాల్గొంటారు. రాజ్యాంగ పీఠికను చదివించడం బాలల అసెంబ్లీ, పార్లమెంటు కార్యక్రమాలు, లౌకిక, మానవత్వ, సమతా మమతల పండుగలు, వనభోజనాలు నిర్వహిస్తారు. సూర్యచంద్ర గ్రహణాలు, మూఢనమ్మకాలను సవాల్ చేస్తూ పది వేల మంది పిల్లలు రోడ్ల మీదకొచ్చి గ్రహణాన్ని వీక్షించారు. సైన్స్ వండర్ షోలు, ఒక్క మాటలో చెప్పాలంటే? ఈ ప్రపంచం పిల్లలదే. ఎదగడానికి ఎల్లలు లేవు అన్నట్లుగా విజ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణంలో కేరళ ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేస్తున్నది.

# విద్వేష 'మూర్తి'



మన రాజ్యాంగానికి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంటులో చర్చ జరుగుతోంది. బయటనేమో రాజ్యాంగ ఉల్లంఘనలు, వ్యతిరేక ఆచరణలూ విరివిగా కొనసాగు తున్నాయి. ఈ ఉల్లంఘనలు వ్యక్తులో, కొందరు సంఘ వ్యతిరేకులో చేస్తున్నది కాదు. రాజ్యాంగాన్ని రక్షించాల్సినవారే. మొన్న మొన్నటి వరకూ రాజకీయ నాయకులూ, కొన్ని పార్టీలూ ఈ పనిచేస్తున్నా యనుకున్నాం. కానీ, ఇప్పుడు ఎవరైతే రాజ్యాంగం ప్రకారం ఈ దేశ ప్రజలందరికీ న్యాయం జరిగేట్లు చూడాల్సిన బాధ్యతల్లో ఉన్న న్యాయమూర్తులే ఈ ఉల్లంఘనలకు పాల్పడటం విపరీత పరిణామం. అలహాబాదులో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. ఇది చాలా తీవ్రమైందిగా పరిగణించాల్సి ఉంది. అందుకనే ఆ న్యాయమూర్తిని తొలగించడానికి రాజ్యసభ సభ్యులు, సభ సెక్రటరీ జనరల్‌కు అభిశంసన నోటీసునూ అందించారు.

ప్రధానంగా జస్టిస్ యాదవ్ మాట్లాడిన మాటల్లో ముఖ్యమైనది. "ఈ దేశం, ఇక్కడ నివసిస్తున్న 'మెజారిటీ' కోరికల ప్రకారం నడుస్తుంది. ఇది చట్టం" అన్నాడు. మెజారిటీ కోరికల ప్రకారం న్యాయమూర్తులు, చట్టాలు, న్యాయాలు పనిచేస్తే ఇక రాజ్యాంగం ఎందుకు? న్యాయానికీ మెజారిటీకి సంబంధం ఉందా! ఇది ఒక న్యాయమూర్తికి ఉండాల్సిన ఆలోచనేనా! అప్పుడు బలహీనవర్గాలు, మైనారిటీ వర్గాల హక్కులు, న్యాయం కోల్పోవలసిందేనా! మతమార్పిడులు, యూనిఫారమ్ సివిల్ కోడ్, వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లులు మొదలైన అంశాలపై చర్చించే వీహెచ్‌పీ సమావేశంలో న్యాయమూర్తి ప్రసంగం చేయటమే, న్యాయ వ్యవస్థ విలువలను మంటగలపడమైతే, ఇలాంటి వ్యాఖ్యలు చేయటం మరీ దారుణం. మెజారిటీ ప్రజల కోసమే పాలనా, న్యాయము కొనసాగాలని కోరుకునే వాళ్లు మతపరంగా ప్రజలలో విషబీజాలను నాటాలనీ, విద్వేషాలను రెచ్చగొట్టాలనీ, విభజించాలనీ ప్రయత్నిస్తున్నారని వేరే చెప్పాల్సిన పనిలేదు. మెజారిటీ ప్రకారమే ఏ న్యాయమైనా అన్నపుడు, మహాభారత యుద్ధమే గుర్తుకు వచ్చింది. అందులో కౌరవులు వందమంది. పాండవులు ఐదుగురే. వందమంది మెజారిటీ కదా! వారు చెప్పినట్లే పరిపాలన సాగాలంటే రాజ్యం వారికే చెందేది. కానీ కృష్ణుడు పాండవుల పక్షం చేరి న్యాయం కోసం పాటుపడ్డాడని భారత కథ చెప్పే నీతి. భారత రామాయణాలు, భగవద్గీత గురించి తరచూ మాట్లాడే సంఘ్ పరివారం, వీటి నుండి ఏమీ నేర్చుకోరా? మత ఆవలంబకుల సంఖ్యను ఆధారం చేసుకుని న్యాయమూ, పరిపాలన చేయటం, మనం ఏర్పరచుకున్న రాజ్యాంగానికి వ్యతిరేకమయినవి. మెజారిటీ ప్రకారమే నడవాలని మనం ఇక్కడ కోరుకుంటున్నామంటే పక్కన బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న వివక్షతల్ని దాడుల్ని సమర్థిస్తామా? అది ఆటవిక న్యాయమే అవుతుంది. చట్టం బహుసంఖ్యాకులకు అనుకూలంగా పనిచేస్తే అల్ప సంఖ్యాకుల హక్కులకు, స్వేచ్ఛకు, న్యాయానికి అవకాశమే ఉండదని చెప్పటం రాజ్యాంగ విరుద్ధం. అంతేకాదు, దేశంలోని జస్టిస్ యాదవ్ మాట్లాడుతూ జంతువుల వధను చూస్తూ పెరిగే పిల్లలు సహనం, కరుణ కలిగి ఉండరని మాంసాహారులందరిపైన తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పర్సనల్ లా పేరుతో పెళ్లిళ్లు, సంప్రదాయాలు అంటే కుదరదనీ మాట్లాడారు. ఈ దేశంలో జంతువులను వధించి విదేశాలకు మాంసాన్ని ఎగుమతి చేస్తున్న వారిలో ఎక్కువమంది మెజారిటీగా ఉన్న మతస్తులే ఉన్నారన్న విషయం జస్టిస్‌కు తెలియకపోవడం విచారకరం. మాంసాహారులు, మాంసం విక్రయించే వాళ్ల కరుణ, సహనం లేని వాళ్లవుతారనే పాఠం ఆ స్థాయి న్యాయమూర్తి నుండి రావడం మన దౌర్భాగ్యం. అసలు ఒక మతం కోసం, దాని రక్షణ, సేవ కోసం పనిచేస్తున్న సెక్టేరియన్ సంస్థ నిర్వహించే సమావేశానికి న్యాయమూర్తి హాజరుకావడమే సరికాదు. కోర్టుల్లో, చట్టసభల్లో చర్చించబడుతున్న అంశాలపై బహిరంగంగా న్యాయమూర్తులు మాట్లాడటం న్యాయ విలువలకు సంబంధించిన పెద్ద సమస్య. రాజ్యాంగంపై ప్రమాణం చేసి వచ్చినవారు, లౌకిక, ప్రజాస్వామిక రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా మాట్లాడటం అంటే రాజ్యాంగంపై దాడిగానే భావించాలని, ఇది ఆందోళనకర విషయమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ చేసిన వ్యాఖ్య వాస్తవిక ప్రతిస్పందనే. న్యాయ వ్యవస్థను కూడా మతతత్వంతో నింపుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ విద్వేష విభజన ప్రచారానికి కారణం. తరతరాలుగా వస్తున్న మతసామరస్యత, సహనం, భిన్నత్వంలో ఏకత్వం మన భారతీయ వారసత్వం. దీన్ని విచ్ఛిన్నం చేయటమేకాక, రాజ్యాంగాన్ని కూడా ధ్వంసం చేయాలని పూనుకోవడం దుర్మార్గమైనది. రాజ్యాంగం అమలులోకి వచ్చిననాడే సంఘ్ పరివార్‌శక్తులు, అంబేద్కర్ రాజ్యాంగం మాకు సమ్మతం కాదని స్పష్టంగానే ప్రకటించారు. మనుధర్మ శాస్త్రమే మా రాజ్యాంగమనీ సెలవిచ్చారు. అట్లాంటి వారు 75 ఏండ్ల రాజ్యాంగాన్ని భక్షిస్తారు కాని రక్షించలేరు. అందులో భాగమే జస్టిస్ వ్యాఖ్యలు. ప్రజలే దీన్ని తిప్పికొట్టాలి.

# జమిలి పాట..రాజ్యాంగానికి పోటు..

పార్లమెంటు ఉభయ సభలూ ప్రస్తుతం అతి కీలకమైన రెండు అంశాలపై చర్చ తలపెట్టాయి. ఇందులో ఒకటి నడుస్తుండగా మరొకటి నిర్ణయం కావలసి వుంది. మరొకటి సోమవారం మోడీ ప్రభుత్వం తీసుకు రానున్నది. నిజానికి ఈ మూడూ పరస్పర సంబంధం లేనివేమీ కాదు. రేపు తీసుకు వస్తామంటున్న మార్పులు చేర్పులు గానీ రాజ్యాంగ మూల స్ఫూర్తికి పూర్తి విరుద్ధమైనవి. వాటిని జనంతో మింగించేందుకే ఏవో వేడుకలు, ఉత్సవాలు, చర్చలు అంటూ మాయ నాటకం నడిపిస్తున్నారు. అదానీకి సంబంధించిన ఆరోపణలతో సహా పలు కీలకాంశాలు దాటవేసేందుకు కూడా ఈ ప్రహసనం తీసుకొచ్చారని చెప్పాలి. ప్రభుత్వం తరపున లోక్‌సభలో చర్చలో పాల్గొన్న సీనియర్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాజ్యాంగంలో నిబంధనలను గురించిగాక ఏకగ్రీంగా ప్రకటించిన రాజ్యాంగ ప్రతిని ప్రశ్నించడంతో మొదలు పెట్టారు. రాముడు సీత విగ్రహాలతో ఏవో మత చిహ్నాలు వుంటే వాటిని లేకుండా చేశారని ఆరెస్సెస్ చిరకాల ఆరోపణలు సభలో వల్లెవేశారు. రాజ్యాంగ నిర్మాతలు కోవిదులైన వారిని గౌరవించకపోగా దాంట్లో భారతీయత ఏ మాత్రం లేదని తిట్టిపోసిన ఆరెస్సెస్ భావ ప్రవక్తలైన వినాయక దామోదర సావర్కర్, జనసంఘ్ వ్యవస్థాపకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ వంటి వారి పేర్లు జపించారు. మత రాజకీయాలను ఆ నాడే తిరస్కరించిన భగత్‌సింగ్‌ను తమ ఖాతాలో వేసుకుని మాట్లాడారు. ఇందిరా గాంధీ కుటుంబాన్ని విమర్శించే పేరిట నాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని స్వాతంత్ర పోరాట విలువలను తిరస్కరించే బిజెపి, ఆరెస్సెస్ బాణీయే ఈ చర్చలో అడుగడుగునా గోచరిస్తున్నది. మరోవైపు కాంగ్రెస్, ఎస్‌పి, సిపిఎం తదితర పార్టీలు ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు, రాష్ట్రాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలకు హాని కలుగుతున్న తీరును ప్రస్తావిస్తే వారికి మహా కంటగింపుగా వుంటున్నది. అడుగడుగునా అడ్డు తగులుతూ చర్చను రచ్చగా మారుస్తున్నారు. కాంగ్రెస్ తరఫున వయనాడ్ నుంచి ఎన్నికైన ప్రియాంక గాంధీ తొలి ప్రసంగం కూడా ఈ అంశంపైనే కావడం విశేషం.




**-జమిలి జుమ్లా**

ఇప్పటికే కేంద్ర క్యాబినెట్ జమిలి ఎన్నికల బిల్లుకు ఆమోదం తెల్పింది గనక సోమవారం నాడు న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ దాన్ని సభలో ప్రవేశ పెడతారని ప్రకటించారు. ఈ లోగా వీలైన ప్రతి చోటా బిజెపి, ఎన్‌డిఎ నాయకులు దానికి మద్దతు ప్రకటిస్తూ కొత్త కొత్త సిద్ధాంతాలు తీసుకొస్తున్నారు. తెలుగు రాష్ట్రాల వరకూ చూస్తే ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం జమిలిని బలపరుస్తున్నదని స్పష్టంగా ప్రకటించారు. ఇప్పుడు బిల్లు ఆమోదించినా 2029లోనే శాసనసభ ఎన్నికలు జరుగుతాయని ఆయన కొత్త సవరణ ప్రకటించారు. మరోవంక దీనిపై స్పష్టమైన వైఖరి తీసుకోని వైసిపి మాత్రం రాజ్యాంగ కోణం కన్నా తమకు తొందరగా మళ్లీ ఎన్నికలు వస్తాయన్న ఆనందంతో పొంగిపోతున్నది. స్వయంగా ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ జమిలికి సిద్ధంగా వుండాలంటుంటే వారి మీడియా, ఆ పార్టీ ప్రతినిధులు కూడా జమిలి జపమే చేస్తున్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ కూడా సూటిగా స్పందించకుండా మరింత స్పష్టత రావాలని చెబుతున్నది. కానీ వాస్తవానికి రేవంత్ సర్కారు గడువుకు ముందే తొలగిపోతుందనే ఆనందం వారిలో తొంగి చూస్తున్నది. ప్రాంతీయ పార్టీలుగా ఈ మూడూ సమాఖ్య విధానానికి రాజ్యాంగ స్ఫూర్తికీ పూర్తి విరుద్ధమైన ఈ మార్పును గట్టిగా వ్యతిరేకించాల్సింది పోయి తాత్కాలిక దృష్టితో మాట్లాడటం దురదృష్టకరం. చంద్రబాబు నాయుడు బిల్లు ఆమోదించినా ఎన్నికలు రాబోవని నమ్మకంగా చెబుతున్నారంటే మోడీ తీరు, ఆరెస్సెస్, బిజెపి రాజకీయాలు ఆయనకు తెలియవనా? ఎన్‌డిఎలో చేరే నాటికే వారి విధానాలు ఇలానే వుంటాయని చంద్రబాబు వంటి వారికి బాగా తెలుసు. ఏమైనా అధికారం కోసం మోడీతో రాజీపడి ఆయన హుకుంలను ఆమోదించక తప్పదని తల వంచుతున్నారు. బిజెడి, అకాలీదళ్, ఎఐడిఎంకె, లోక్ జనశక్తి వంటివి బలపర్చాయని నివేదిక చెబుతున్నది. బిఆర్ఎస్, ముస్లింలీగ్, నేషనల్ కాన్ఫరెన్స్, వైసిపి, టిడిపి వంటివి అధికారికంగా సమాధానమివ్వలేదట. డిఎంకె, ఆప్, ఎస్‌పి, వంటి ప్రాంతీయ పార్టీలతో పాటు కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి, ఎస్‌పి వంటివి గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. చిన్నా పెద్ద కలిపి 32 పార్టీలు బలపరుస్తుంటే 15 వ్యతిరేకిస్తున్నాయని లెక్క చెబుతున్నారు. గతంలో కొంత బలపర్చిన పార్టీలు కూడా ఇప్పుడు వ్యతిరేక వైఖరి తీసుకున్నాయని దీనిపై నివేదికనిచ్చిన కమిటీ అధ్యక్షుడు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వెల్లడించారు.

తరంగాలు Tharangalu Daily News Paper RNI . TELTEL / 2022 / 83463

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మున్నూరు కాపుల మద్దతు

-హుజూర్ నగర్ లో త్వరలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం.
-మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి కోలా నాగేశ్వరరావు



**సూర్యాపేటజిల్లా బ్యూరో డిసెంబర్ 15(తరంగాలు)** తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మున్నూరు కాపుల మద్దతు ఉంటుందని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోల నాగేశ్వరరావు, శాసనాల నాగ సైదయ్య, కామిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటుచేసిన మున్నూరు కాపు సమావేశంలో వారు మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన విధంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీకి మున్నూరు కాపు సంఘం పూర్తి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తిగత స్వార్థంతో కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారని, వ్యక్తిగత ప్రయోజనాల కన్నా మున్నూరు కాపు సంఘ ప్రయోజనాలే ముఖ్యమని అన్నారు. మున్నూరు కాపులు రాజ్యాధికారం సాధించేందుకు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మున్నూరు కాపు మిత్రులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తుందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం మున్నూరు కాపులు నిరంతరం కృషి చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మున్నూరు కాపులకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ కీలకమైన పదవులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రంలో , రాష్ట్రంలో మంత్రులుగా మున్నూరు కాపు ఎంతో మందికి పదవులు ఇచ్చిందని, పార్లమెంటు, రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించిందన్నారు. రాష్ట్రంలోని ఇతర కులాలకు ఏర్పాటు చేసిన విధంగానే మున్నూరు కాపులకు కార్పొరేషన్ ప్రకటించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ మున్నూరు కాపులకు న్యాయం చేస్తున్న నమ్మకం ఉన్నదని అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, సహకార సంఘం ఎన్నికల తో పాటుగా మున్సిపల్ ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీకి మున్నూరు కాపులు మద్దతు ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ గా పుంజాల అలేఖ్య, ప్రభుత్వ విప్ గా ఆది శ్రీనివాస్ కు అవకాశం కల్పించి సముచిత స్థానం కల్పించారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరు కాపులకు నామినేట్ పదవుల్లో అవకాశం కల్పించనున్నదని తెలిపారు. హుజూర్ నగర్ లో త్వరలో నియోజకవర్గ స్థాయిలో మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆత్మీయ సమ్మేళనంకు రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డి దంపతులను ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు. మున్నూరు కాపుల అభివృద్ధికి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు కాసర్ల నాగేశ్వరరావు, ఆవుల వెంకటయ్య, కడియం శ్రీనివాసు, కాల్వ లక్ష్మయ్య, కాల్వ పెద్ద వెంకటేశ్వరరావు, కాలవ చిన్న వెంకటేశ్వరరావు, ఆవుల సతీష్, అమరోజు గోపయ్య, ఎలిశెట్టి వెంకటేశ్వరావు, తోట నరసింహారావు పాల్గొన్నారు.

## సర్వ మానవాళికి దిక్సూచి భగవద్గీత

-శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి
-పేటలో భక్తి శ్రద్ధలతో సహస్ర గళ గీతార్చన




**సూర్యాపేట జిల్లాబ్యూరో డిసెంబర్ 15(తరంగాలు)** భగవద్గీత మత గ్రంథం కాదని సర్వ మానవాళికి దిక్సూచి భగవద్గీతే అని శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి భక్తులకు ఉపదేశించారు. దేవాలయాలు, ధార్మిక సంస్థల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రవి మహాల్లో ఏర్పాటు చేసిన సహస్రగళ గీతార్చన కార్యక్రమంలో స్వామిజీ పాల్గొని భక్తులను ఉద్దేశించి ప్రవచించారు. భగవద్గీత మత గ్రందం కాదని, సుమారు 5200ల సంవత్సరాల క్రితం శ్రీకృష్ణుడు బోదించినదే భగవద్గీత అని, అప్పుడు భూమిపై ఏ మతం లేదన్నారు. భగవద్గీత, రామాయణంలపై ప్రతి హిందువు తమ పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. భగవద్గీతను పారాయణం చేసుకుంటూ భగవంతుని వైపు మన జీవితాన్ని పయనింపజేయాలన్నారు. అనంతరం భక్తులచే భగవద్గీత సహస్ర గళ గీతార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయాలు ధార్మిక సంస్థల ఐక్య వేదిక నిర్వాహకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీదర్ కుమార్, తోట శ్యాంప్రసాద్, కర్నాటి రవి, గట్ల సోమయ్య, నాగవెల్లి ధశరథ, బ్రహ్మదేవర సోమయ్య, మొరిశెట్టి రామ్మూర్తి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## గ్రూప్ II పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ నాగేశ్వరరావు




**సూర్యాపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 15(తరంగాలు)** ఆదివారం గ్రూప్ II రాత పరీక్ష కు సంభందించిన జిల్లా కేంద్రంలో ని పరీక్షా కేంద్రాలను అదనపు ఎస్పి నాగేశ్వరరావు పరిశీలించారు. పరీక్షా సరళిని, పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ను పర్యవేక్షణ చేశారు. జిల్లా కేంద్రంలో గల ఎస్ వి ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలు, బిసి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. అదనపు ఎస్పీ నాగేశ్వరరావు వెంట రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్సై బాలునాయక్ తదితరులున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్




**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 15(తరంగాలు):** ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు తెడ్ల జవహర్ బాబు కూతురి వివాహం మిర్యాలగూడ టౌన్ హౌసింగ్ బోర్డు ఎస్పీ కన్వేషన్ హాల్ లో బంధుమిత్రుల నడుమ అంగరంగ వైభవంగా జరిగినది. ఇట్టి లివివాహ వెడుకకు మాజీ ఎమ్మెల్యే & బి ఆర్ ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షులు నల్లమోతు భాస్కర్ రావు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట నాయకులు మాలావత్ రవీందర్ నాయక్, అల్లాని రమేష్, గుడిపాటి సైదులు బాబు, మెరుగు సంజయ్, రేపాల రమేష్, జైని బ్రదర్స్, లింగా రెడ్డి, సైది రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా మహా పడిపూజ



**జఫర్గడ్ డిసెంబర్ 15(తరంగాలు):** మండలంలోని తమ్మడపల్లి (జి)గ్రామం లో ఆదివారం అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన అన్నం బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో వారి ఇంటి వద్ద మధ్యాహ్నం మహాభిక్ష అన్నదాన కార్యక్రమం స్వాముల మహా పడిపూజ మహెూత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్ప శరణం శరణం అయ్యప్ప స్వామి శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామ స్మరణంతో మారి మోగింది. ఈ మహా పడిపూజ మహెూత్సవానికి పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొనిఅయ్యప్ప నామస్మరణం, భజన పాటలు,భక్తి గీతాలు ఆలపించ్చారు.

## మీరేనా! మేము ఆడించగలం

-చిన్నారిని ఎత్తుకొని ఆడించిన టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్





**మహబూబాబాద్,15డిసెంబర్,తరంగాలు:** మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని గ్రూప్ 2 పరీక్షలు జరుగు తున్న సందర్భంగా తక్షశిల సెంటర్లో ఆసక్తికరమైన సంఘటన చోటు చేసుకున్నది.గ్రూప్ 2 పరీక్ష రాసే ఒక మహిళ తన చిన్నారిని పరీక్ష హాల్లోకి తీసుకువెళ్లడానికి వీలు లేకపోవడంతో మేమున్నామంటూ అక్కడే డ్యూటీలో ఉన్న టౌన్ సిఐ పెండ్యాల దేవేందర్,తన సిబ్బంది కలిసి ఆ పాపను తమ చేతుల్లోకి తీసుకున్నారు.అనంతరం పాప తల్లి నిర్భయంగా గ్రూప్ 2 పరీక్ష రాయడానికి వెళ్ళింది.ఆ మాతృమూర్తి పరీక్ష రాసి వచ్చేంతవరకు ఈ పాపను మహిళా పోలీసులు,సీఐ పెండ్యాల దేవేందర్ ఆడించారు.ఈ సంఘటన చూసి అక్కడున్న ప్రజలు టౌన్ పోలీసులను అభినందించారు.

## సికింద్రాబాద్ వైఎంసిఏ గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వనమాల రమేష్ నేత




**సికింద్రాబాద్,15డిసెంబర్, తరంగాలు:** ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ వైఎంసిఏ గ్రౌండ్ లో గ్రాండ్ క్రిస్మస్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు కొప్పుల రాజు,ముఖ్య ప్రసంగికులు జాన్ వెస్లీ,ప్రోగ్రాం కోఆర్డినేటర్ గద్దపాటి విజయరాజ్ కొనసాగించిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున వచ్చిన రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్లు బెల్లయ్య నాయక్,వెన్నెల గద్దర్, దీపక్ జాన్ హాజరైన వేడుకలకు నల్గొండ జిల్లా నుంచి జాతీయ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ కోఆర్డినేటర్ వనమాల రమేష్ నేత తన బృందంచే పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ దయానంద్,బెజవాడ రవికుమార్,సాల్మన్ రాజ్, ఎస్ అబ్రహం,దేవరకొండ కిష్టపర్,పృధ్వీరాజ్, కృపాకర్,జిల్లా శాంతి కుమార్,కోట్ల సునీత దేవి, ముషీరాబాద్ రాణి,షారోన్ ఉప్పల్,సయ్యద్, చిట్యాల రామ్ కిషోర్ గుప్తా,కొల్లి మురళి,భీమనపల్లి సైదులు,వసుకుల మాధవి,దేవరకొండ అనసీయ, రమేష్ కళాకారుల బృందంచే పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎంగా మహేష్ కుమార్ గౌడ్ ని నియమించాలి

-కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కి బీసీ నేత లింగంగౌడ్ విజ్ఞప్తి



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 15 (తరంగాలు):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అగ్రకులాలకు ముఖ్యమంత్రి పదవి దళితులకు డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టారని జనాభాలో 55% పైగా ఉన్న బీసీలకు కూడా డిప్యూటీ సీఎం గా అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ విజ్ఞప్తి చేశారు.అధికారంలో ఉన్న లేకపోయినా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బీసీ బిడ్డ ఎమ్మెల్సీ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ కి డిప్యూటీ సీఎంగా నియమించాలి విద్యార్థి దశ నుండి విద్యార్థి యువజన నిరుద్యోగ సమస్యలపై పోరాడుతూ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగమైన ఎన్ ఎస్ య ఐ జిల్లా అధ్యక్షుడు నుంచి రాష్ట్ర అధ్యక్షునిగా స్వయంకృషితో అంచలంచెలుగా ఎదుగుతూ పార్టీ పటిష్టత కోసం గత 40 సంవత్సరాలుగా పనిచేస్తూ అపార అనుభవం ఎలాంటి మచ్చలేని వ్యక్తి మహేష్ గౌడ్ కి అధ్యక్ష పదవి ఇస్తే 55% ఉన్నటువంటి బీసీలకు న్యాయం చేసినట్టవుతుందన్నారు .జనాభా దామాషా ప్రకారం పదవులు కేటాయిస్తామని చెపుతున్న కాంగ్రెస్ అధిష్ఠానం అది నిరూపించుకోవాలి.

# రైతులపై దాడిని ఖండిస్తూ మోడీ దిష్టిబొమ్మ దహనం.

**కొత్తపల్లి శివకుమార్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి**

**సూర్యాపేటజిల్లా బ్యూరో డిసెంబర్ 15(తరంగాలు)** గిట్టుబాటు ధరకై ఢిల్లీ లో ధర్నాకు బయలుదేరుతున్న రైతులను ఢిల్లీ సరిహద్దుల్లో టియర్ గ్యాస్ ఉపయోగించి దాడులు చేయడాన్ని ఖండిస్తూ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు.మోడీ ప్రభుత్వం వచ్చాక రైతులను, కార్మికులను నిర్లక్ష్యం చేస్తూ, చట్టాలను మారుస్తూ అంబానీ, ఆదానికి అండగా నిలబడుతూ, వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేసే దిశగా అడుగులు వేస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తుంటే, దాన్ని వ్యతిరేకిస్తూ మాకు గిట్టుబాటు ధర కావాలని ఢిల్లీలో ధర్నాకు బయలుదేరిన రైతులను శంభు సరిహద్దు వద్ద నిర్ధాక్షిణ్యంగా పోలీసులతో దాడులు చేయించి టీయర్ గ్యాస్ ఉపయోగించి 18 మంది రైతులను గాయాల పాలు చేశారన్నారు. ఇది మోడీ నియంతృత్వానికి నిదర్శనం అని,మోడి నియంతృత్వ విధానాలను ఖండిస్తూ రైతుల డిమాండ్లను నెరవేర్చాలని మోడీని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, అరుణోదయం జిల్లా నాయకులు గొడ్డలి నరసన్న, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ,పార్టీ డివిజన్ నాయకులు ఎస్కే సయ్యద్, పివోడబ్ల్యు సహాయ కార్యదర్శి సంతోషి, నాయకులు పద్మ, రేణుక, పిఓఎల్ నాయకులు రమేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు తల్లిదండ్రుల స్మృతి కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గంటా



**మహబూబాబాద్,15డిసెంబర్, తరంగాలు:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో ఆయన తల్లిదండ్రులు నారాయణ-వెంకటనర్సమ్మలస్మృతి కేంద్రాన్ని



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితర ప్రముఖులు సందర్శించారు.కేసముద్రం మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం నిర్మించిన ఏం.కే.కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన గంటా శ్రీనివాసరావు ఆ తర్వాత ఎంపీ రవిచంద్ర స్వగ్రామాన్ని సందర్శించి నారాయణ-వెంకట నర్సమ్మల స్మృతి కేంద్రానికి వెళ్లి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారి వెంట ఎంపీ రవిచంద్ర అన్నలు వద్దిరాజు కిషన్, వద్దిరాజు దేవేందర్,తమ్ముళ్లు వద్దిరాజు మోహన్, వెంకటేశ్వర్లు, మున్నూరుకాపు ప్రముఖులు వీ.ప్రకాష్,రౌతు కనకయ్య,సీ.విఠల్,ఆకుల రంజిత్, మరికల్ పోత సుధీర్ కుమార్,డాక్టర్ జే.ఏన్.వెంకట్, డాక్టర్ పీఏల్ఏన్ పటేల్,దుర్గం రవీందర్,ఊసా రఘు,తదితరులు ఉన్నారు.

# కరెంటు పై కాంగ్రెస్ నిర్లక్ష్యం

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**



**నర్సంపేట ,డిసెంబర్ 15, తరంగాలు:** రైతులకు అందించే కరెంటు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది మాట్లాడుతూ నియోజకవర్గం లోని వ్యవసాయం మరియు గృహ అవసరాలకు లో వోల్టేజ్ సమస్య రాకుండా పెరుగుతున్న కరెంటు డిమాండ్ కు అనుగుణంగా 33/11 కేవీ మూడు సబ్ స్టేషన్లను గతంలో మంజూరు చేయించడం జరిగిందని పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని ద్వారక పేట,గురిజాల,నల్లబెల్లి మండలంలోని కొండాపూర్ ప్రాంతాలలో సబ్ స్టేషన్లు మంజూరు చేయడం జరిగిందని సబ్ స్టేషన్ల నిర్మాణానికి కావాల్సిన అన్ని అనుమతులను సంపూర్ణంగా తీసుకురావడం జరిగిందన్నారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ సంవత్సర కాలంగా నిర్మాణ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో రెండో పంట వేసుకున్న రైతులకు కరెంటు సమస్యలో ఉంటే సమస్య ఎదురవుతూ పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని కావున తక్షణమే సబ్స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# అధ్యయనం ద్వారానే పోరాటాలను ఉధృతం చేయగలం

**-ఎస్ డబ్ల్యూ ఎఫ్**




**సూర్యాపేటజిల్లా బ్యూరో, డిసెంబర్ 15(తరంగాలు)** అధ్యయనం, అవగాహన, ఆలోచన ద్వారానే పోరాటాలను ఉదృతం చేయగలమని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ఎస్ రావు అన్నారు. స్థానిక సూర్యపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో సంఘం జోనల్ స్థాయి నాయకత్వ శిక్షణ తరగతులలో పాల్గొని సంఘం విశిష్టతపై క్లాస్ ను బోధించి మాట్లాడారు. ఐక్యత- పోరాటం నినాదంతో ఆర్టీసీలోని కార్మిక సంఘాలను ఐక్యం చేసిన చరిత్ర యస్ బ్ల్యు ఎఫ్ దేనని అన్నారు. 1979లో ఏర్పడి ఐక్యత పోరాటం నినాదంతో అనేక ఐక్య ఉద్యమాలను నిర్మించామన్నారు. కార్మిక వర్గ దృక్పథంతో కార్మికుల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తున్నామని అన్నారు. కార్మికులు వర్గ దృక్పథం తో ఆలోచన చేసి కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. దీనికి శిక్షణ తరగతుల వల్ల అవగాహన ఏర్పడుతుందని కార్యకర్తలు, నాయకులుగా శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి జాతీయ అంతర్జాతీయ విషయాలను బోధిస్తూ అమెరికా పెట్టుబడిదారి విధానాన్ని కొనసాగిస్తూ అనేక దేశాలపై దండయాత్రలు చేస్తుందన్నారు. తమతో పోటీ పడుతున్న చైనాపై దుష్ప్రచారం చేస్తూ తమకు ఎవరు పోటీ లేరనే సంకేతాన్ని ఇచ్చే విధంగా అమెరికా జులుం చేస్తుందన్నారు. మన దేశంలో దేశ సంపదలను బడ కార్పొరేట్లకు, పెట్టుబడుదారులకు ఊడిగం చేసే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మతోన్మాద ఛాయాలను దేశం మొత్తం రుద్ది తమ పబ్బాన్ని గడుపుకోవాలని బిజెపి ప్రయత్నిస్తుందని అన్నారు. రాజ్యాంగ వ్యవస్థను నాశనం చేసే విధంగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు ఎస్డబ్ల్యుఎఫ్ పని పద్ధతులపై క్లాసును బోధించారు. ఎస్డబ్ల్యుఎఫ్ కార్యకర్త ప్రతి అంశం పట్ల ఆలోచన ఏకాగ్రతతో పనిచేయాలని, ఇది నిజాయితీలతో క్రమశిక్షణతో పని చేస్తారని అలాంటి అంశాలను ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు.. దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ఆర్టీసీలో జరుగుతున్న పరిణామాలు, శ్రద్ధతో గమనిస్తూ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలన్నారు ఈ క్లాసులను సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం రాంబాబు ప్రారంభించగా ఎస్ డబ్ల్యూ ఎఫ్ రీజియన్ అధ్యక్షులు కె నరసింహ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఈ క్లాసుల సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు గీత యూనియన్ జండా ఆవిష్కరణ చేశారు.ఈ క్లాసుల్లో రాష్ట్ర కార్యదర్శులుబత్తుల సుధాకర్, కృష్ణ, రీజన్ నాయకులు లక్ష్మయ్య శ్రీకంట్లం, గుండు రమేష్ యాదప్ప, సోమయ్య శ్రీనివాస్ రెడ్డి,, రవి, శ్రీనివాస్, రాములు, కృష్ణయ్య, నాగమల్లు వెంకన్న, పర్శరాములు, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అంతా తానై మానవత్వం చాటిన రవీందర్ రెడ్డి

**-గురుకుల విద్యార్థి అమూల్యకు వైద్యసహకారం**

**-వైద్యం కోసం నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించిన మంత్రి సీతక్క,తనయుడు ధనసరి సూర్య**

**పినపాక,15డిసెంబర్,తరంగాలు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం పెంటన్నగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి గుమాసు అమూల్య ఇటీవలే తీవ్ర అనారోగ్యానికి గురైంది. పాల్వంచలోని నవభారత్ గురుకుల విద్యాలయంలో అమూల్య 9వ తరగతి చదువుతుంది.వాలీబాల్ ప్లేయర్ అయిన ఈమె ఇటీవలే జరిగిన సీఎం కప్ ఆటల పోటీల్లో పాల్గొంది. అమూల్య జట్టు మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో విజయం సాధించి ఖమ్మం జిల్లా వైరాలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంది.అనంతరం తిరిగి తమ గురుకుల పాఠశాలకు వచ్చాక తీవ్ర జ్వరం, జలుబుతో అస్వస్థతకు గురైంది.మూడు రోజుల క్రితం గురుకుల బాధ్యులు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో హుటా హుటిన భద్రాచలంలోని కిమ్స్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు.ప్లేట్లెట్స్ బాగా పడిపోయి, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ ఎక్కువ ఉండటంతో మూడు రోజుల చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించింది.ఆర్థిక దుస్థితిలో ఉన్న అమూల్య కుటుంబానికి ఈ ఆసుపత్రిలో కూడా రూ. 45 వేల వరకు వైద్య ఖర్చులు కాగా మొత్తం చెల్లించారు. కాగా భద్రాచలం కిమ్స్ ఆసుపత్రి వైద్యులు శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులకు సూచన చేస్తూ అమూల్యను



హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరిలించాలని చెప్పారు.దింతో చేసేది లేక బిడ్డను బతికించుకోవడం కోసం ఆదివారం తెల్లవారు జామున నిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు.అయితే నిమ్స్ లో వైద్యం కోసం బెడ్స్ ఖాళీ లేవని ఆసుపత్రి బాధ్యులు తిరస్కరించారు.దీంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు.బిడ్డను కాపాడుకునే తపన... ఆందోళనలో సమీపంలో వున్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.ఆ ఆసుపత్రిలో అమూల్యను ఐసియులో ఉంచి వైద్యం ప్రారంభించారు.శనివారం ఉదయం నుంచి సాయంత్రానికే రూ. 50 వేల వరకు బిల్లు వేశారు.ఈ పరిణామంతో అమూల్య తండ్రి సన్నకారు రైతు అయిన వెంకటేశ్వర్లు వెంట తీసుకెళ్లిన డబ్బులు మొత్తం కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ రోజుల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో మానవత్వం,మనిషి పట్ల కనికరం మచ్చుకైనా కనిపించడం లేదు.చేతుల్లో చిల్లి గవ్వ లేక తండ్రి వెంకటేశ్వర్లు,కుటుంబ సభ్యులు హైదరాబాద్ లో ఒక్కరోజు గడవకముందే నానా అవస్థలు ఎదుర్కొన్నారు.బీదవాళ్లకు పెద్ద జబ్బులు వస్తే ఇక మరణమే శరణ్యంగా భావించారు.చేతుల్లో డబ్బులు లేక ఆ ప్రైవేట్ ఆస్పత్రిలో గంటగంటకు మందులు,వివిధ పరీక్షల పేర బిల్లులు కట్టలేక దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు.ఈ దశలో మంత్రి సీతక్క,ఆమె తనయుడు ధనసరి సూర్య దృష్టికి ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన మంత్రి సీతక్క,సూర్య నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుని సహకరించారు. దీంతో అమూల్య కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.ప్రైవేట్ ఆస్పత్రి నుంచి ఆమెను శనివారం రాత్రికి రాత్రి నిమ్స్ కు తరిలించారు.మంత్రి కలగజేసుకుంటే గాని నిమ్స్ ఆసుపత్రిలో బెడ్,వైద్యం అందలేదు.నిమ్స్ కు తరలించే విషయంలో రవీందర్ రెడ్డి కూడా చాలా సహకరించారు.స్వయంగా ఆసుపత్రికి వెళ్లి అక్కడ వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స కోసం రవీందర్ రెడ్డి కృషి చేసి బాధిత కుటుంబానికి తానున్నానని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. స్వయంగా అమూల్య దగ్గరికి వెళ్లి పరామర్శించి, చికిత్స ఎలా అందిస్తున్నారో వైద్యులతో మాట్లాడి తెలుకున్నారు.క్లిష్ట పరిస్థితుల్లో వున్న వెంకటేశ్వర్లు కుటుంబానికి రవీందర్ రెడ్డి అందించిన భరోసా, సహకారంతో ఆ కుటుంబానికి స్వాంతన అభించింది.

# అయ్యప్ప స్వామి దేవాలయంలో మహా అన్నప్రసాద వితరణ

**- బి ఎల్ ఆర్ ఆధ్వర్యంలో**

**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 15 (తరంగాలు):** మిర్యాలగూడ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నందు 26వ రోజు నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాములకు అన్నప్రసాద వితరణ చేసి, స్వామి సేవలో పాల్గొన్నారు.అనంతరం స్వాములలో మాట్లాడి కార్యక్రమ సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బి ఎల్ ఆర్ మాట్లాడుతూ,ఈ మహా అన్నప్రసాద కార్యక్రమం కోసం స్వతహాగా ముందుకు వచ్చి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను, అని పేర్కొన్నారు.సోమవారం ఉదయం 6:00 గంటలకు అయ్యప్ప స్వామి వారి కలషం ఊరేగింపుగా గుడిపాటి నవీన్ ఇంటికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయని బి ఎల్ ఆర్ తెలియజేశారు. ఈ పూజా కార్యక్రమానికి



మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు, అయ్యప్ప స్వాములు, భక్తులు, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



# ఐకమత్యంతోనే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ

-మాదిగ,మాదిగ ఉప కులాలు ఐకమత్యంతో సాగాలి

-మాదిగల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు




**జనగామ,15డిసెంబర్, తరంగాలు :** రాష్ట్రంలో ఏబిసిడి వర్గీకరణ అమలు చేసేంతవరకు మాదిగ,మాదిగ ఉపకులాలు ఐకమత్యంతో ముందుకుసాగాలని, అందరిని సమన్వయం చేసుకుంటూ నిరంతరం ఐకమత్యంతో పోరాటం చేస్తామని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు అన్నారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని వైఎస్ఎస్ఆర్ భవన్ లో మాదిగ ఐక్య సంక్షేమ సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం గాదె సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు .ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గౌరవ సలహాదారు జిలకర శ్రీనివాస్,వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దెపాక రవీందర్, రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమ్మడి పవిత్రం,రాష్ట్ర కమిటీ సభ్యులు మారెపల్లి ఎల్లయ్య లు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు మాట్లాడుతూ వర్గీకరణ రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు.రాష్ట్రంలో ఏకైక అతిపెద్ద కులంగా ఉన్న మాదిగ జాతిని పార్టీలకు,సంఘాలకు అతీతంగా ఒకే వేదిక మీదికి తీసుకురావాలనే ఉద్దేశంతో సంఘం పనిచేస్తుందన్నారు.మాదిగ జాతి ఐక్యంగా ముందుకు పోతేనే ఆర్థిక,రాజకీయంగా అభివృద్ధి చెందుతుందని సామాజికంగా తగిన గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా గాదె సుధాకర్ ను నియమించారు.జిల్లా వ్యాప్తంగా మండల,గ్రామ కమిటీల ఏర్పాటుకు నేటి నుండి శ్రీకారం చుట్టామని అన్నారు.ఈ సమావేశంలో భాస్కల వెంకటయ్య, గుర్రం శీను,కొడిశాల పరశురాములు,అరవింద్, శ్రావణ్, శివకుమార్, అఖిల్, సన్నీ,గాదె శ్రీనివాస్,,గాదె ఎల్లయ్య,ఎం నివేద్,జన్ను స్వామి,అరూరి కార్తీక్, అయిత అనిల్, అరూరి కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన డైట్,కాస్మోటిక్ చార్జీలు పౌష్టికాహార లోప నివారణకు దోహదపడుతాయి

-ఘనంగా న్యూ డైట్ మెనూ లాంచింగ్ ప్రోగ్రాం







**ఐనవోలు,15డిసెంబర్, తరంగాలు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల,సంక్షేమ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల డైట్,కాస్మోటిక్ చార్జీలు పెంచడం వల్ల విద్యార్థులకు పౌష్టికాహార లోపం లేకుండా ఉండేందుకు దోహదపడుతాయని జడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు.మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో నిర్వహించిన న్యూ డైట్ మెనూ లాంచింగ్ కార్యక్రమానికి హనుమకొండ జడ్పీ సీఈఓ విద్యాలత,ఐనవోలు తహసీల్దార్ విక్రమ్,మండల విద్యా శాఖ అధికారి ఆనందం హాజరయ్యారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా జడ్పీ సీఈఓ విద్యాలత, ప్రిన్సిపాల్ శ్రీలత కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం జడ్పీ సీఈఓ విద్యాలత మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు పాఠశాలలోనే ప్రారంభం అవుతుందని నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించుటకు ఉపాధ్యాయుడు ఆదర్శంగా ఉండాలన్నారు.అలాగే ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని సూచించారు. అందుకుగాను ప్రతి ఉపాధ్యాయుడు కీలకపాత్ర వహించాలి అన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ తిరునగరి శ్రీలత మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి సొసైటీ డైట్ చార్జీలను పెంచడం హర్షనీయమని అన్నారు. గురుకుల విద్యార్థుల డైట్ చార్జీలు 40 శాతం పెంచినందుకు గాను శనివారం గురుకుల పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులు, అధికారులు గురుకుల హాస్టల్ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని పిల్లలతో కలిసి భోజనం చేశారు.

# శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎంపీ వద్దిరాజు,మాజీ ఎంపీ వీ.హెచ్







**కేసముద్రం,15డిసెంబర్)తరంగాలు:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,మాజీ ఎంపీ వి.హనుమంతరావు,మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, శంకర్ నాయక్ తదితర ప్రముఖులతో కలిసి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం అమీనాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. మున్నూరుకాపు సంఘం కేసముద్రం మండల శాఖ అమీనాపురంలో నిర్మించిన ఏంకే కన్వెన్షన్ (మున్నూరుకాపు ఫంక్షన్ హాల్) ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యేందుకు ఆదివారం విచ్చేసిన సందర్భంగా ఎంపీ రవిచంద్ర, హనుమంతరావు తదితర ప్రముఖులు శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామికి తమ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీకి చెందిన బచ్చు పరమేశ్వరం,ఓలం రాజేశ్వర్ వారికి సాదర స్వాగతం పలికారు. అర్చకులు వారిని పూలమాలలు, కండువాలతో సత్కరించి,ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఎంపీ రవిచంద్ర, మాజీ ఎంపీ హనుమంతరావులతో కలిసి మున్నూరుకాపు ప్రముఖులు సర్ధార్ పుటం పురుషోత్తమ రావు,పారా నాగేశ్వర్ రావు,ఆర్జేసీ కృష్ణ,దిండిగాల రాజేందర్, ఆకుల గాంధీ,ఆకుతోట ఆదినారాయణ, మూలగుండ్ల వెంకన్న, ముత్యం ఉప్పలరావు, తాళ్లూరి హనుమంతరావు, మాడూరి పూర్ణచందర్ రావు,మామిడి అశోక్,తీగల విజయ్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఘనపురం అంజయ్య, మారినేని వెంకన్న,నాగసాయి రాజశేఖర్, మాటేటి రవి, తదితరులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

## బీజేపీ నూతన బూత్ కమిటీ ఎన్నిక



**వర్ధన్నపేట,15డిసెంబర్,తరంగాలు:** భారతీయ జనతా పార్టీ వర్ధన్నపేట మండల సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఆదివారం బీజేపీ మండల అధ్యక్షులు రాయపురపు కుమారస్వామి ఆధ్వర్యంలో ఇల్లంద గ్రామంలోని బూత్ నెంబర్ 219 ప్రస్తుతం మారిన నెంబర్ 222 కమిటీని ఎన్నుకున్నారు.నూతన కమిటీకి అధ్యక్షులుగా వేల్పుల కార్తీక్ ను ఎన్నుకున్నారు.వర్సన్నపేట మండల సంయోజక్ జిల్లా ఉపాధ్యక్షులు ఏకాంతం ఎన్నుకోబడిన బూత్ అధ్యక్షులకు శాలువాకప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాంపల్లి యాకయ్య,మండల ఎన్నికల ఇంచార్జ్ సాంబయ్య,మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కృష్ణమూర్తి,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కర్క సోమిరెడ్డి,మల్లెపాక దూడయ్య, జోగుల సంపత్,సట్ల అనిల్,మల్లెపాక రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప నామ స్మరణతో మారుమోగిన కక్కిరాలపల్లి



**ఐనవోలు,15డిసెంబర్,తరంగాలు:** కక్కిరాలపల్లి గ్రామంలో నిర్వహించిన మహాసమిష్టి 18 కలిశాల పడిపూజ ఘనంగా నిర్వహించారు.తాంత్రిక గురు స్వామి ఆధ్వర్యంలో మొదటి పూజ శ్రీ విఘ్నేశ్వర స్వామికి ప్రారంభించారు. ఆనవాయితీగా అంబీమాత పూజ నిర్వహించి అనంతరం శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పకు ఎనమిది కలశాలతో కూడిన గంగా,యమునా, కావేరి,గోదావరి, కృష్ణమ్మ జలాలతో పాటు పాలు,గంధం, చందనం, కుంకుమ,విభూది, నెయ్యి,పెరుగు,పలు పలు రకాల పండ్లుతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు.అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను మాల ధరించిన స్వాములకు అందజేశారు.సుమారు మూడు వందల మంది మాల ధరించిన స్వాములు అలాగే. గ్రామ ప్రజలు ఆరు వందలు మంది ఈ మహా సమిష్టి పడిపూజలో పాల్గొన్నారు.పూజా కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని అష్టైశ్వర్యాలతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని తాంత్రిక గురుస్వామి ఆశీర్వచనాలు వచ్చిన ప్రజలకు అందజేశారు. ఈ మహా సమిష్టి పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించిన మాల ధరించిన స్వాములు,గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గురు స్వాములు కిషన్,రాజు,సుమన్,రాజేందర్, నాగరాజు,గంట స్వామి కంజర్ల భాస్కర్,తదితర స్వాములు పాల్గొన్నారు.

## పోలోజు యుగంధర్ శర్మకు దక్కిన జాతీయ దైవ జ్యోతిష్య వాస్తు అవార్డు

తమిళనాడు లోని పాండిచ్చేరిలో అవార్డు అందుకున్న శర్మ





**వర్ధన్నపేట,15డిసెంబర్, తరంగాలు :** ప్రముఖ పురోహితులు, వాస్తు జ్యోతిష్యులు పోలోజు యుగంధర్ శర్మకు అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి దైవ జ్యోతిష్య వాస్తు అవార్డు-2024 దక్కింది.ఆదివారం తమిళనాడు రాష్ట్రంలోని పాండిచ్చేరిలో భారతీయ ఆధ్యాత్మిక,వైధిక జ్యోతిష్యం,వాస్తు అవైచి సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, వాస్తు జ్యోతిష్యుల 3వ అంతర్జాతీయ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వర్ధన్నపేట పట్టణానికి చెందిన ప్రముఖ పురోహితులు,వాస్తు జ్యోతిష్యులు పోలోజు యుగంధర్ శర్మ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పురోహితులు,వాస్తు జ్యోతిష్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పురోహితుల సంఘం అధ్యక్షులు డాక్టర్ కె కృష్ణమూర్తి చేతుల మీదుగా యుగంధర్ శర్మ జాతీయ స్థాయి దైవ జ్యోతిష్య వాస్తు అవార్డు-2024ను అందుకున్నారు.అనంతరం అవార్డు గ్రహీత యుగంధర్ శర్మ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో దైవ జ్యోతిష్య వాస్తు అవార్డు దక్కడం చాలా సంతోషంగా ఉందని,ఈ అవార్డు తనపై ఆధ్యాత్మికత,వాస్తు జ్యోతిష్యం పై మరింత బాధ్యతను పెంచిందన్నారు.తనకు ఈ అవార్డు ప్రకటించిన సంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బహుమతులు అందజేసిన దొమ్మటి



**పరకాల,డిసెంబర్ 15, తరంగాలు:**
పరకాలలో జిల్లాస్థాయి జూనియర్స్ కబడ్డీ సెలక్షన్ లో జూనియర్స్ కబడ్డీ హనుమకొండ జోన్ హసన్ పర్తి జోన్ విజయకేతనం ఎగురవేశారు.ఆదివారం హనుమకొండ జోన్ మొదటి బహుమతి,రెండో బహుమతి హసన్ పర్తి జోన్ టీమ్ కు ముఖ్య అతిథులుగా టీపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య,గ్రంథాలయం సంస్థ చైర్మన్ అజిజఖాన్,పరకాల ఏసీపీ సతీష్,పరకాల పట్టణ అధ్యక్షుడు కోయ్యడ శ్రీనివాస్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీ సారంగపాణి హాజరై బహుమతులు అందజేశారు.


## కండక్టర్ కె .సాగర్ కు కాంస్య పతకం



**పరకాల డిసెంబర్ 15 తరంగాలు**
ఇటీవల వైజాగ్ లో జరిగిన ఆల్ స్టేట్స్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ యూనియన్ ఆల్ ఆలిండియా నేషనల్ అథ్లెటిక్స్ పోటీలో డిస్కస్ త్రో పురుషుల విభాగం లో కాంస్య పతకం సాధించిన పరకాల ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ కె.సాగర్ ని ఆదివారం రోజున ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో తెలంగాణ పిసిసి ఉపాధ్యక్షుడు దోమ్మటి సాంబయ్య, హన్మకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అజీజ్ ఖాన్,టి జి స్ ఆర్ టి సి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు సోదా రామకృష్ణ, సాగర్ కి శాలువాతో సత్కరించి అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ఇకముందు కూడా ఎన్నో పథకాలు సాధించి తెలంగాణ ఆర్టీసీకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. సెక్రటరీ ఈ ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ పరకాల డిపోకు పేరు తెచ్చినందుకు అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్, మండల, పట్టణ అధ్యక్షులు, పరకాల మున్సిపల్ కౌన్సిలర్స్ , కబడ్డీ అసోసియేషన్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయ్ యూనియన్ అధ్యక్షుడు లౌడియా గోవర్ధన్ నాయక్, చీఫ్ అడ్వైజర్ పి సురయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓ రవీందర్, ఎమ్ సునీత, గ్యారేజీ సెక్రెటరీ ఏకే స్వామి తదితరులు పాల్గొన్నారు

## పుట్టినరోజు వేడుకకు హాజరై చిన్నారి నిహారిని ఆశీర్వదించిన

**మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి**



**తరంగాలు న్యూస్ డిసెంబర్ 15**
చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన కుర్ర వెంకటేశ్వర్లు అలియాస్ (బాబు సార్) కుమారుడు క్రాంతి కుమార్ – శిరీషదంపతుల కుమార్తె నిహారిని మొదటి పుట్టినరోజు కార్య క్రమానికి నర్సంపేట పట్టణంలోని పద్మశాలి గార్డెన్లో అంగరగా వైభవంగా జరగగా, మాజీ ఎంపీపీ కేతీడి వీరారెడ్డి, హాజరై చిన్నారిని నిండు మనసుతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాటా శ్రీనివాస్, ఎండి సుభాన్, కుర్ర భాస్కర్, మెండే భద్రయ్య, బాణాల వెంకన్న, కుర్ర శ్రీనివాస్, బెల్లి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం..





**నర్సంపేట ఆర్సీ,15డిసెంబర్, తరంగాలు:**
ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన ఖానాపురం మండలం మంగళవారిపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారిపేట గ్రామానికి చెందిన మూడు వీరన్న తన పాడి పశువుల కోసం సుమారు 30 వేల విలువైన పశుగ్రాసం నిల్వ చేసుకున్నాడు.ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో మంటలు ఆర్పే లోపు పశుగ్రాసం మొత్తం కాలి బూడిదై పోయింది. తన పశువులు ఆకలితో అలమటిస్తాయని,తిరిగి పశుగ్రాసం కొనడానికి తన వద్ద ఆర్థిక స్తోమత లేదని,తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

# పండుగలా హనుమాండ్ల తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలు












**-యువతకు ఆదర్శం మార్కెట్ చైర్మన్ తిరుపతి రెడ్డి**

**-తిరుపతన్నకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ**

**-రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు**

**రాయపర్తి,15డిసెంబర్,తరంగాలు:తొర్రూరు** వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలు పండుగను తలపించాయి.ఆదివారం రాయపర్తి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డిని కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కోసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా తిరుపతి రెడ్డికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నుండి పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హమ్య నాయక్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి,దేవస్థాన కమిటీ చైర్మన్ టీఎం కృష్ణమాచార్యులు,రాయపర్తి గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చ రమేష్,కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు బొమ్మెర కళ్యాణ్ గౌడ్,మండల ముఖ్య నాయకులు, ప్రముఖులు,యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్సీ హాస్టల్ సందర్శన

**హన్మకొండ ప్రతినిధి తరంగాలు**





హనుమకొండ జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్,జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ లు డిమాండ్ చేశారు. శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక హన్మకొండ లోని ఎస్సీ హాస్టల్ ప్రభుత్వ సందర్శించి మధ్యాహ్న భోజన పరిస్థితిని,హాస్టల్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్,జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ లు మాట్లాడుతూ హన్మకొండ లో ఉన్న ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ పాఠశాలలో మొత్తం 120 మంది విద్యార్థులు వున్నారు విద్యార్థులకు సరేనా మూత్రశాలలు మరుగు దొడ్లు,మౌళిక సదుపాయాలు లేనందువల్ల విద్యార్థులు ఆనేక అవస్థలు పడుతూ ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం బిల్లులు గత 10 నెలలుగా విడుదల కాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.వెంటనే ప్రభుత్వం,విద్యాశాఖ అధికారులు స్పందించి ఎస్సీ హాస్టల్ ప్రత్యేక దృష్టి సారించి ఎస్సీ హాస్టల్ లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కే.కుషాల్,అభి,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం



**పరకాల,డిసెంబర్ 15, తరంగాలు:**
పరకాల పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బొచ్చు ప్రశాంత్ మాదిగ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నూతన గ్రామ కమిటీ నిర్మాణంలో భాగంగా పరకాల మండల కమిటీ నిర్మాణం కోసం ఈ నెల 18న బుధవారం రోజున పరకాల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.మాలల కొమ్ముకాస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రూప్ తో నోటిఫికేషన్ లో బత్తిని వర్గీకరణ అమలు తర్వాతే నిర్వహించాలని లేనిపక్షంలో స్థానిక సంస్థల ఎలక్షన్లలో మాదిగలు కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘ వివిధ గ్రామల కామారెడ్డి పల్లె, లక్ష్మీపురం, నాగారం, పైడిపల్లి, పోచారం, వెల్లంపల్లి గ్రామాల నాయకులు మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు రేణిగుంట్ల శివ కుమార్ మాదిగ, బొమ్మ కంటి శంకర్ మాదిగ, పెండల శోభన్ మాదిగ, కొయ్యడ రఘుపతి మాదిగ, మంగళపల్లి కుమార్ మాదిగ, పెండల చంద్రమౌళి, తిక్క శ్రీను, శంకర్ మాదిగ, బొచ్చు విక్రమ్ మాదిగ, తిక్క దిలీప్ మాదిగ, తిక్క రఘు మాదిగ, ఒంటేరు భరత్ మాదిగలు పాల్గొన్నారు.

# మున్నూరు కాపుల ఐక్యత వర్ధిల్లాలి





### -రాజ్యసభ ఎంపీ రవిచంద్ర

**కేసముద్రం,15డిసెంబర్,తరంగాలు:** ప్రధాని నరేంద్రమోడీ ఓబీసీనని చెప్పుకోవడమే తప్ప ఒరగబెట్టిందేమీ లేదని,కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయకపోవడం తీవ్ర విచారకరమని మాజీ ఎంపీ వీ.హనుమంతరావు అన్నారు.గత ప్రభుత్వాలు కులగణన ఎందుకు చేయలేదని అడుగుతున్న మోడీ,ఇప్పుడు అధికారంలో ఉన్న ఆయనే చేయొచ్చు కదా అని ప్రశ్నించారు.మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఏం.కే.కన్వెన్షల్ (మున్నూరుకాపు ఫంక్షన్ హాల్)హాల్ ప్రారంభోత్సవానికి వీహెచ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రాంతాలు,రాజకీయాలకు అతీతంగా మనం పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతామని స్పష్టం చేశారు.బీసీలలోని ఇతర కులాల వారితో సఖ్యతగా మెలగడం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు ఎన్నో పనులు ఉన్నప్పటికీ ఎంపీ వద్దిరాజు, శాసనసభ్యులు గంగుల ఆహ్వానించడంతో ఇక్కడకు రావడం జరిగిందన్నారు.మారుమూలన ఉన్న ఒక మండల కేంద్రంలో పెద్ద ఫంక్షన్ హాలు కట్టడం,ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేయడం,ఈ సందర్భంగా బంధువులందరిని కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.వేర్వేరు పేర్లతో పిలువబడుతున్నా కూడా మున్నూరుకాపు, తెలగ,కాపులు,బలిజ,తూర్పు కాపులంతా ఒకటేనని.. ప్రాంతాలకు అతీతంగా మన సంఘటిత శక్తిని నిరూపించుకోవలసిన అవసరం ఉందని ఎమ్మెల్యే గంటా చెప్పారు.భవిష్యత్ మనదేనని, రాజకీయాలను శాసించే రోజులు తప్పకుండా వస్తాయని శ్రీనివాసరావు



ధీమా వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా ఆయన కేసముద్రం మున్నూరుకాపు సంక్షేమ సంఘానికి రూ.5లక్షలు విరాళంగా అందజేశారు.ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హయాంలో మున్నూరుకాపు నాయకులు 9మంది ఎమ్మెల్యేలు ఉంటే,అదే ఇప్పుడు 3గురు మాత్రమే ఉన్నారన్నారు. మన జనాభా గణనీయమైన సంఖ్యలో ఉన్నప్పటికీ రాజ్యాధికారం దక్కకపోవడం శోచనీయమన్నారు. అవసరమైన ప్రతి సందర్భంలో మన సంఘటిత శక్తిని చూపుదామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి విశిష్ఠ అథితిగా హాజరైన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ మనమందరం ఐకమత్యంతో ముందుకు సాగుతున్నామని చాటి చెప్పడానికి ఈ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమమే మంచి ఉదాహరణ అన్నారు.మనం రూపొందించుకున్న బైలా ఇతర కుల సంఘాలు కూడా మార్గదర్శనంగా తీసుకున్నాయని వివరించారు.ఈ ఫంక్షన్ హాలును ఇంత మంచిగా నిర్మించడం,ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరవ్వడం రెండు తెలుగు రాష్ట్రాల చెందిన మన బంధువులకు ఆదర్శనీయమన్నాడు. మున్నూరు కాపులమైన మనం రైతు బిడ్డలం,పది మందికి అన్నం పెట్టే వాళ్లం,సాయపడేవాళ్లమని ఎంపీ రవిచంద్ర చెప్పారు.పవన్ కళ్యాణ్ మాదిరిగా మన సంఘటిత శక్తిని నిరూపించుకుందామని, అవసరమైన ప్రతి సందర్భాన్ని సద్వినియోగం చేసుకుందామని ఎంపీ రవిచంద్ర చెప్పారు. బీసీలలోని ఇతర కులాల వారితో స్నేహభావాన్ని పెంపొందించుకుంటూ రాజ్యాధికారం వైపు వడివడిగా అడుగులేద్దామని పిలుపునిచ్చారు. ఫంక్షన్ హాల్ నిర్మాణానికి తమ వద్దిరాజు కుటుంబం సాయపడిందని,అవసరమయితే ఇక ముందు కూడా తోడ్పాటు అందిస్తామని ఎంపీ రవిచంద్ర తెలిపారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్,నన్నపనేని నరేందర్, బానోతు శంకర్ నాయక్,మున్నూరు కాపు ప్రముఖులు వీ.ప్రకాష్,సీ.విఠల్,కొండా దేవయ్య, వద్దిరాజు కిషన్,సర్దార్ పుటం పురుషోత్తమ రావు, రౌతు కనకయ్య,పారా నాగేశ్వర్ రావు,దిండిగాల రాజేందర్,ఆర్జేసీ కృష్ణ,దుర్గం రవీందర్,ఆకుల గాంధీ, డాక్టర్ బీఎల్ఎన్ పటేల్,ఆకుల రజిత్,మరికల్ పోత సుధీర్ కుమార్,కొత్త సీతారాములు తదితరులు హాజరై ప్రసంగించారు.కేసముద్రం మున్నూరుకాపు సంక్షేమ సంఘానికి రౌతు కనకయ్య లక్షా పదివేల రూపాయలు విరాళంగా అందించారు. మంగళ వాయిద్యాలు,వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, హోమం,పూజలతో ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.మున్నూరుకాపు సంఘం కేసముద్రం శాఖ ప్రముఖులు చందా గోపి,కమటం స్వామి,సింగంశెట్టి ఏకాంతం తదితరులు అతిథులకు పుష్పగుచ్ఛాలిచ్చి శాలువాలతో సత్కరించారు,జ్ఞాపికలు అందించారు.ఈ సందర్భంగా వేదికపై ప్రముఖులంతా చేయిచేయి కలిపి అభివాదం చేస్తూ మున్నూరుకాపుల ఐక్యతను చాటి చెప్పారు.ఈ కార్యక్రమానికి హాజరైన వారంతా జై మున్నూరుకాపు జైజై మున్నూరుకాపు,వర్ధిల్లాలి వర్ధిల్లాలి మున్నూరుకాపుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు.కార్యక్రమం అనంతరం అందరూ కలిసి ఆత్మీయ విందు ఆరగించారు.



(తరంగాలు)....
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రేసు కమిటి అధ్యక్షులు
బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ని హైదరాబాద్ లో కలసిన ఏఐసిసి సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

# గురుకుల విద్యాలయాలలో ఘనంగా యూనిఫామ్ డైట్ ప్రోగ్రాం





**హన్మకొండ ప్రతినిధి (తరంగాలు)** తెలంగాణ ప్రభుత్వము,సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల గురుకుల విద్యాలయాలలో "యూనిఫామ్ డైట్ ప్రోగ్రాం" శనివారం నిర్వహించారు.దీనిలో భాగంగా సాంఘిక సంక్షేమ గురుకులాల పాఠశాలల కళాశాలల బాలికలు వరంగల్ వెస్ట్ నందు ఘనంగా యూనిఫామ్ డైట్ ప్రోగ్రాం నిర్వహించిన కార్యక్రమానికి ఏం. దాస్ డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ డిఆర్డిఏ హనుమకొండ జిల్లా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా సునీల్ కుమార్ వ్యవసాయ అధికారి అయినవోలు మండలం వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు సుమారు 500 మంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏ సుభాషిని దేవి మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రకటించిన మెస్ చార్జీలు,కాస్మోటిక్ చార్జీలు గణనీయమైన పెంపు మన విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు.అలాగే విద్యార్థినులు అనేక పోటీలలో పాల్గొని సాధించిన విజయాలను ఉదాహరించినారు.ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు మరియు కాస్మటిక్ చార్జీలు పట్ల తల్లిదండ్రులు,విద్యార్థినిలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ముఖ్య అతిథి మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల విద్యార్థుల మీద ప్రభుత్వ నిధులు వెచ్చిస్తున్న తీరును వివరిస్తూ విద్యార్థులు కష్టపడి చదువుతూ తమ గమ్యాన్ని చేరుకోవాలని తెలియజేశారు. పాఠశాల కళాశాల విద్యార్థినిలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తదనంతరం తల్లిదండ్రులకు,విద్యార్థులకు పౌష్టికాహారంతో భోజనాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల,కళాశాల పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

-జర్నలిస్టులపై దాడి చేయడం సమంజసం కాదు
-మోహన్ బాబు పై వెంటనే కేసు నమోదు చేయాలి
-వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం



**వర్దన్నపేట,15డిసెంబర్,తరంగాలు:** ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాచారాన్ని సేకరించి అందజేస్తున్న జర్నలిస్టులపై దాడులు సమంజసం కాదని వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం అన్నారు.వర్ధన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుల్ల యాకాంతం మాట్లాడుతూ మోహన్ బాబు ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య జరుగుతున్న గొడవల గురించి కవరేజ్ కోసం వెళ్లిన టీవీ9 ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులపై మోహన్ బాబు దాడి చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు.మోహన్ బాబుకు మానసిక స్థితి సరిగా లేనట్లు ఉందని అతన్ని వెంటనే ఎర్రగడ్డలోని మానసిక రోగుల కేంద్రానికి పంపించాలని అన్నారు.ఇష్టం వచ్చినట్లుగా బౌన్సార్లను పెట్టి ఒక భయంకర వాతావరణం సృష్టిస్తున్నారని అన్నారు.అలాంటి వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహించబోరని అన్నారు.జర్నలిస్టులపై అకారణంగా దాడులకు పాల్పడి విచక్షణ రహితంగా కొట్టిన మోహన్ బాబు పై పోలీసులు సుమోటో కింద వెంటనే నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో మరోసారి జర్నలిస్టులపై దాడి జరగకుండా చూడాలని కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా నిలబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ముందు ప్రధాన రహదారిని రెడ్ క్రాస్ రోడ్ గా నామకరణం

-రెడ్ క్రాస్ సేవలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బాసట
-రాష్ట్ర ముఖ్యమంత్రి తో చర్చించి తలసీమియా పిల్లలకు పింఛన్ అందేలా ప్రయత్నం



**హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 15 (తరంగాలు)** హనుమకొండ రెడ్ క్రాస్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా తలసీమియా పిల్లలకు పింఛన్ మంజూరు చేయడంపై రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చిస్తానని నాయిని హామీ ఇచ్చారు.హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో రెడ్ క్రాస్ కార్యాలయంలో రెడ్ క్రాస్ కార్యకలాపాల భవన నిర్మాణానికి ఆదివారం వారు భూమి పూజ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,మేయర్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరై శిలాఫలకం ఆవిష్కరించారు.అదే విధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకొని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు ద్వారా బన్ను ఆరోగ్యదా సేవ సొసైటీ ఫౌండర్ డాక్టర్ వీరమల్ల చరణ్ జిత్ రెడ్డి ఉచితంగా అందించిన 10 అత్యాధునిక (అమెరికా) బెడ్లను రాజేందర్ రెడ్డి పరిశీలించారు.అనంతరం తలసీమియా పిల్లలతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదాన సేవలతో పాటు రాష్ట్రంలో తొలి స్థానంలో నిలుస్తున్న రెడ్ క్రాస్ సేవలను ప్రశంసించారు. తలసీమియా పిల్లలకు పింఛన్లు అందేలా ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఈ సందర్భంగా అయన హామీ ఇచ్చారు. ఢిల్లీలో పార్లమెంట్ వద్ద ఉన్న రెడ్ క్రాస్ రోడ్ లా హనుమకొండ లో రెడ్ క్రాస్ ఎదురుగా వున్నా ప్రధాన రహదారిని 'రెడ్ క్రాస్ రోడ్' గా నామకరణం చేయాలని మేయర్ ని కోరారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ రెడ్ క్రాస్ అభివృద్ధి కోసం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని 'రెడ్ క్రాస్ రోడ్' గా నామకరణం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.రెడ్ క్రాస్ అభ్యున్నతికి ప్రభుత్వానికి అవసరమైన సూచనలు పంపిస్తామని చెప్పారు.రెడ్ క్రాస్ కమిటీ తరపున ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,మేయర్ గుండు సుధారాణి లను శాలువా,పుష్ప గుచ్ఛం,జ్ఞాపిక ను అందించి సత్కరించారు రెడ్ క్రాస్ సిబ్బందికి నివాస స్థలాలు మంజూరి చేయాలనీ వినతిపత్రం అందజేయగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ అంశంపై జిల్లా కలెక్టర్ తో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి,పెద్ది వెంకట నారాయణ గౌడ్,వైస్ చైర్మన్, బొమ్మినేని పాపిరెడ్డి,కోశాధికారి ఈ.వి. శ్రీనివాస్ రావు,రాష్ట్ర పాలకవర్గ సభ్యులు,జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్,డాక్టర్ మాగంటి శేషుమాధవ్,పొట్లపల్లి శ్రీనివాస్ రావు,డాక్టర్ హెచ్.సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ళ రమణారెడ్డి,స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి, జీవితకాల సభ్యులు,రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొర్రెముల ఏకశిలా నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ 7 వ వారం సమావేశం

**-సంఘీభావం తెలియజేసిన గోపు బాలరాజు యాదవ్**

**-ప్లాట్ ఓనర్స్ కు న్యాయం జరిగేంత వరకు పోరాడుదాం: ఏకశిలా నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేన్స్ సభ్యులు**




**15 డిసెంబర్, తరంగాలు: పోచారం**

మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపల్ పరిధి కొర్రెముల ఏకశిలా ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏడవ వారం ఆదివారం రోజు ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమం ఏకశిలా నగర్ కొర్రెముల లో రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 739 ఉండి 749 వరకు 140 ఎకరాల భూమిలో 1985లో వెంచర్ చేశారని తెలిపారు 2006లో ఒక బిల్డర్ తప్పుడు పత్రాలు సృష్టించి పాస్ పుస్తకాలు పొందారని ఆరోపించారు ఇప్పటివరకు ఏకశిలా నగర్ బ్రాంచ్ అసోసియేషన్ సభ్యులు అంతా ఏకంగా మూకుమ్మడిగా ఉంటూ ప్లాట్ ఓనర్ అసోసియేషన్ వాళ్లు కోర్టులో కేసు గెలిచినామని మా యొక్క ప్లాట్ లలో మేము ఇల్లు కట్టుకొనుటకు పర్మిషన్లు కూడా తీసుకొని ఇల్లు నిర్మించుకుంటామని మాకు సహకరిస్తున్న వారందరికీ ధన్యవాదాలు అని అన్నారు ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ డైరెక్టర్ గోపు బాల్ రాజ్ యదవ్, ఏకశిలా అసోసియేషన్ అధ్యక్షులు మాణిక్యాలరావు కార్యవర్గ సభ్యులు శివారెడ్డి మాటూరి రవి శ్రీనివాస్ చారీ సుభాష్ చంద్ర బోస్ ముత్త రెడ్డి వెంకటేష్ నాయక్ రమనరెడ్డి సోమ్లా నాయక్ బాల్ రాజ్ ధర్మేంద్ర గోవర్దన్ రావు ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హెల్త్ క్యాంప్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**రెడ్డి సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**

**ప్రారంభించిన పిసిసి సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి**



**15 డిసెంబర్, తరంగాలు:సూర్యాపేట ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంప్ ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిసిసి సభ్యులు,పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం నాడు విద్యానగర్ లోని బేబిమూన్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాదు యశోద ఆసుపత్రికి చెందిన 13 మంది వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్ నందు బిపి, సుగర్, ఇసిజి,కార్డియాలజి, బోన్ స్కానింగ్ పరిక్షలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు.గతంలో మాజీ మంత్రిరాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కంటి పరిక్షలు నిర్వహించి, కంటి ఆపరేషన్ లను ఉచితంగా నిర్వహించారని అన్నారు.రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిటెక్ చదువుతున్న పేద విద్యార్ధి మందడి రోహిత కు లాప్ టాప్ ను అందజేశారు.హెల్త్ క్యాంప్ కు సహాయంగా స్థానిక వ్యాపారులు యామా ప్రభాకర్ 15 వేల రూపాయల మందులను అందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ ఆలి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కరీమ్ బేగ్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, పోలబోయిన నర్సయ్య యాదవ్, రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, అధ్యక్షులు గోదాల రంగారెడ్డి, ఉపాధ్యక్షులు సునీల్ రెడ్డి, కోశాధికారి చిలుముల శ్రీనివాస రెడ్డి, సభ్యులు కట్కూరి చంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి,సైదిరెడ్డి,వెన్న వెంకటరెడ్డి,దండ వెంకటరెడ్డి, కాకి మల్లారెడ్డి,సూరం అనిల్ రెడ్డి,నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



**15 డిసెంబర్, తరంగాలు: రాజపేట,**

రాజపేట మండలం చల్లూరు గ్రామంలో ఆదివారం జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ పూజల్లో మాజీ ఆలేరు శాసనసభ్యులు, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. అయ్యప్ప మాల ధారణ ద్వారా స్వాములు దేహ, మనసు శుద్ధి జరుగుతుందని ప్రజల్లో ప్రత్యేకమైన భక్తిశ్రద్ధలు పెంపొందించ బడతాయన్నారుమాల ధారణ చేసిన స్వాములందరు అయ్యప్ప దర్శనానికి క్షేమంగా వెళ్లి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల యువజన అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్ సామల రమేష్ స్వామి నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి కటకం స్వామి మండల యువజన నాయకులు పిట్టల వెంకటేష్ తండా వెంకటేష్ కటకం పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

# కాశికి పోయినా కొండా సురేఖ చేసిన పాపం పోదు

**- బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి**




హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 15 (తరంగాలు) కొండా సురేఖ ను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చెయ్యాలి లేదా నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని కాశికి పోయినా కొండా సురేఖ చేసిన పాపం పోదు అని ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు.వేములవాడ రాజన్న కోడెలను (60) కబేళాలకు తరలించిన అంశం పై బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి తెలంగాణ భవన్ లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖను,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ...దేవదాయ శాఖ మంత్రిగా దేవుడి ఆస్తులకు ధర్మ కర్తగా ఉండాల్సిన మంత్రి కొండా సురేఖ దొంగలకు సద్దులు మోస్తున్నారన్నారు. దేవుడి మీద ఒట్లు,దేవుడి సంపదకు తూట్లు ఇది కాంగ్రెస్ పార్టీ విధానం.ప్రజల సొమ్ముకు ధర్మకర్తలుగా ఉండాల్సిన ప్రభుత్వం ఆఖరికి దేవుడి సొమ్ము కూడా ధర్మకర్తలుగా ఉండటం లేదు.దేవుడి మీద ఒట్లు వేసి మాట తప్పిందన్నందుకే మేడారంలో వేలాది చెట్లు నేలకొరిగాయి. ఇటీవల భూకంపం వచ్చింది. ఇప్పుడు ఏకంగా రాజన్న కోడెలనే కబేళాలకు తరలించారు.మన దొడ్లో పుట్టిన కోడెలను,పేగు బంధం తో సమానమైన కోడెలను దేవుడికి సమర్పిస్తే ఆ కోడెలను కబేళాలకు పంపారు. కొండా సురేఖ చేసిన ఈ పాపం కాశికి పోయినా పోదు.మంత్రి అయినప్పటి నుండి ఓరుగల్లు పరువు తీస్తున్నారు. కాకతీయుల రాజధాని, గొప్ప శైవ క్షేత్రం అయిన ఓరుగల్లు ఆడబిడ్డగా ఈ ప్రాంత ఔన్నత్యాన్ని చాటాల్సింది పోయి,ఇలాంటి దౌర్భాగ్య పనులు చేస్తూ పరువు తీస్తున్నారు. తక్షణమే ఆమెను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చెయ్యాలి. లేదా, నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చెయ్యాలి. వేములవాడ రాజన్న కోడెల తరలింపు,కాంగ్రెస్ విజయోత్సవ సభకు రాజరాజేశ్వర ఆలయ సొమ్ము 2 కోట్లు వాడుకున్న అంశాల పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.కోడెలను తరలించడం లో భాగస్వాములైన వారందరి పై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అభిమానులకు కృతజ్ఞతలు

**-తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి**

**-తొలి అక్షరం ఉమ్మడి రాష్ట్ర బ్యూరో పస్తం సాంబ ఆధ్వర్యంలో తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలు**

**-ప్రజాజీవనయాత్రలో మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలి**

**-ప్రజలందరి చల్లని ఆశీస్సులతో మరిన్ని విజయాలతో ప్రజాసేవలో ముందుకెళ్లి**




**తొర్రూర్ డిసెంబర్ 15 తరంగాలు.**

తనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తన కుటుంబ సభ్యులు,స్నేహితులు మరియు అభిమానులందరికీ తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం తొలి అక్షరం ఉమ్మడి రాష్ట్ర బ్యూరో పస్తం సాంబ ఆధ్వర్యంలో తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా పస్తం సాంబ మాట్లాడుతూ..ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని. మీ ప్రజాజీవనయాత్రలో మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.ప్రజలందరి చల్లని ఆశీస్సులతో మరిన్ని విజయాలతో ప్రజాసేవలో ముందుకెళ్లాలని పేర్కొన్నారు.అనంతరం హనుమాండ్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ....ఈ ప్రత్యేకమైన రోజున తనకు శుభాకాంక్షలు తెలిపిన తొలి అక్షరం ఉమ్మడి రాష్ట్ర బ్యూరో పస్తం సాంబ కి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.మీలో ప్రతి ఒక్కరి నుండి చాలా ప్రేమ,ఆప్యాయతతో చుట్టుముట్టబడినందుకు నేను చాలా కృతజ్ఞుడను అని ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఇది నిజంగా మరపురాని జన్మదిన వేడుకను మాటల్లో చెప్పలేనంతగా హత్తుకుందనీ అన్నారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టులు సదాశివరావు ,కాంగ్రెస్ నాయకులు పెద్దగని సోమయ్య, సోమరాజశేఖర్, నర్కుటి గజ,ప్రవీణ్,తొర్రూర్ ఎస్వి సూపర్ మార్కెట్ అధినేత టేకు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి





**-దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్**

**హనుమకొండ,15డిసెంబర్,తరంగాలు:**

కాంట్రాక్టు పద్ధతిలో విద్యా శాఖ సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు మాజీ శాసన సభ్యులు,బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ సంఘీభావం తెలిపారు.ఈ దీక్షను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ పాలన నుండి తమను రెగ్యులర్ చేయాలని సమ్మె నిర్వహిస్తున్న తమ గోడును విన్న పాపాన పోలేదు,తమ దీక్షా సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి రాగానే వెంటనే తమను సచివాలయానికి పిలిపించుకుని టీ తాగే సమయంలో జివో చేసే బాధ్యతను తీసుకుంటానని మాట ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు తమ విషయం పట్టించుకున్న పాపాన పోలేదని, ముఖ్యమంత్రికి పాలు గాని చక్కెర గాని ఇంకా దొరకలేదా అని ఎద్దేవా చేశారు.అప్పుడు గత ప్రభుత్వం ఇప్పుడు ఇప్పుడున్న ఈ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. అలాగే ఉద్యోగుల సమస్య తిరే వరకు భారతీయ జనతా పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని మాట ఇస్తున్నామని ఈ సమస్య పరిష్కారానికి ఎక్కడి వరకైనా మీతో వస్తానని ప్రభుత్వం ఇకనైనా దిగి వచ్చి వారి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ తరుపున ఉద్యోగులకు మద్దతుగా పెద్ద యెత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో 66 వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్,ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా ఇంచార్జ్ బాబురావు,తదితరులు పాల్గొన్నారు.

# వెంకటయ్య పార్థివ దేహానికి బీఆర్ఎస్ నాయకుల నివాళి...





**రాయపర్తి, 15 డిసెంబర్, తరంగాలు:**

రాయపర్తి మండలం శివరామపురం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడియం వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు రాయపర్తి మండల బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,బీఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మండల అధికార ప్రతినిధి సంతోష్ గౌడ్,మండల నాయకులు నాగపురి సోమయ్య గౌడ్, కొమ్ము రాజు,గ్రామ పార్టీ అధ్యక్షులు జగన్ నాయక్ , కార్యదర్శి చెడుపాక ఎల్లయ్య , తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# గోల్డ్ ర్యాలీకి బ్రేక్?

-వచ్చే ఏడాది ధరల పెరుగుదల అంతంతే
-ట్రంప్ రాకతో వాణిజ్య యుద్ధాలు..
వృద్ధిరేటు, డిమాండ్ పతనం: డబ్ల్యూజీసీ

ఈ ఏడాది జోరుగా పెరిగిన బంగారం ధరలు.. వచ్చే ఏడాదిలో మాత్రం నెమ్మదించవచ్చని చెప్తున్నది ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ). మునుపెన్నడూ లేనివిధంగా దేశంలో పసిడి ధర ఈ సంవత్సరం అక్టోబర్‌లో ఆల్‌టైమ్ హైకి చేరిన విషయం తెలిసిందే. తులం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి రేటు గరిష్ఠంగా రూ.82,400 పలికింది. అయితే అక్టోబర్ ఆఖరుదాకా పరుగులు పెట్టిన గోల్డ్ రేట్లు.. గత నెలన్నర (45 రోజులు)గా పడుతూ.. లేస్తూ.. సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యూజీసీ తాజా అంచనాలు సైతం ప్రస్తుత మార్కెట్ తీరుకు అనుగుణంగానే ఉన్నాయి. కొత్త ఏడాదిలోనూ మార్కెట్ ట్రెండ్ ఇదే రీతిలో ఉండవచ్చన్న అభిప్రాయాన్ని 2025 ఔట్‌లుక్‌లో వ్యక్తం చేసింది.

### 30 శాతానికిపైగానే..

ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు 30 శాతానికిపైగా పుంజుకున్నాయి. సెంట్రల్ బ్యాంకులు, ముఖ్యంగా పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా బంగారం కొనుగోళ్లకు పెద్దపీట వేసింది. ఆర్బీఐ సైతం గోల్డ్ రిజర్వులకు అత్యంత ప్రాధాన్యాన్నిస్తున్న సంగతి విదితమే. అలాగే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ పోరు, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధానం వంటివి స్టాక్ మార్కెట్లను కుంగదీశాయి. ఫలితంగా మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం ప్రత్యామ్నాయ మార్గమైన పసిడి వైపు చూశారు. దీంతో ఈ ఏడాది గోల్డ్ మార్కెట్‌లో డిమాండ్ ఊహించనివిధంగా పెరిగిపోయింది. ఇది ధరలను పరుగులు పెట్టించింది. మరోవైపు పండుగ సీజన్లు,



పెండ్లిళ్ల సీజన్ కొనుగోళ్లు కూడా కలిసొచ్చాయి.

### ఇదీ సంగతి..

బంగారం ధరలు వచ్చే ఏడాది ఈ స్థాయిలో పెరగకపోవచ్చని డబ్ల్యూజీసీ తాజాగా పేర్కొన్నది. జీడీపీ వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు గోల్డ్ మార్కెట్ క్రయవిక్రయాలను ప్రభావితం చేయవచ్చని అంటున్నది. జనవరిలో అమెరికాకు రాబోయే నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు వాణిజ్య యుద్ధాలకు తెర లేపవచ్చన్న ఆందోళనల్ని కనబర్చింది మరి. పరస్పర సుంకాలతో మదుపరులు, కొనుగోలుదారులు మార్కెట్‌కు దూరం కావచ్చని, దీంతో ఆయా దేశాల జీడీపీ, విపణిలో డిమాండ్ పడిపోవచ్చని హెచ్చరించడం గమనార్హం. కానీ ఇప్పటికైతే బంగారం ధరలు అంతర్జాతీయంగా గరిష్ఠ స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. ఔన్స్ 2,700 డాలర్ల సమీపంలో ఉన్నది. ఇక గోల్డ్‌మన్ సాచ్స్ గ్రూప్ వచ్చే ఏడాది ఆఖర్లో 3,000 డాలర్లకు పోవచ్చంటున్నది. యూబీఎస్ ఏజీ అంచనా 2,900 డాలర్లుగా ఉన్నది

## టాప్-5 సంస్థల ఎం-క్యాప్ రూ.1.13 లక్షల కోట్లు వృద్ధి..

భారీగా లబ్ధి పొందిన భారతీ ఎయిర్‌టెల్..!

airtel

భారతీ ఎయిర్ టెల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.47,836.6 కోట్ల వృద్ధితో రూ.9,57,842.40 కోట్లకు చేరుకున్నది. ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.31,826.97 కోట్లు పెరిగి రూ.8,30,387.10 కోట్లకు చేరుకున్నది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ రూ.11,887.78 కోట్లు పుంజుకుని రూ.14,31,158.06 కోట్ల వద్ద స్థిర పడింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎం-క్యాప్ రూ.11,760.8 కోట్ల లబ్ధితో 9,49,306.37 కోట్లకు చేరింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఎం-క్యాప్ రూ.9,805.02 కోట్లు పుంజుకుని రూ.16,18,587.63 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.52,031.98 కోట్ల పతనంతో రూ.17,23,144.70 కోట్ల వద్ద నిలిచింది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఎం-క్యాప్ రూ.32,067.73 కోట్ల నష్టంతో రూ.5,89,869.29 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎం-క్యాప్ రూ.22,250.63 కోట్లు పతనమై రూ.5,61,423.08 కోట్లకు చేరుకున్నది. ఎస్బీఐ ఎం-క్యాప్ రూ.2,052.66 కోట్లు, ఐటీసీ ఎం-క్యాప్ రూ.1,376.19 కోట్లు కోల్పోయాయి. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంకు, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్, ఎస్బీఐ, ఐటీసీ నిలిచాయి గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల్లో టాప్-10 సంస్థల్లో ఐదు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,13,117.17 కోట్లు వృద్ధి చెందింది. భారతీ ఎయిర్‌టెల్ భారీగా లబ్ధి పొందగా, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ఐసీ నష్టపోయాయి. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 623.07 పాయింట్లు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 90.5 పాయింట్లు వృద్ధి చెందాయి.

# భూషణ్ స్టీల్‌కు భారీ ఊరట

జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు చెందిన భూషణ్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కు భారీ ఊరట లభించింది. సుప్రీంఆదేశాలకు అనుగుణంగా ఈడీ జప్తు చేసిన రూ.4,025 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించింది.కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ప్రకారం దివాలా-ఐబీసీ కింద దివాల తీసిన కంపెనీ ఆస్తులను జేఎస్‌డబ్ల్యూ సరైన పరిష్కారం చూపించడంతో ఈడీ ఈ నిర్ణయం తీసుకున్నది. భూషణ్ స్టీల్‌కు చెందిన ఈ ఆస్తులను పీఎంఎల్‌ఏ చట్ట ప్రకారం గతంలో ఈడీ జప్తు చేసింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ సూచనల మేరకు ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేసి



# రోహిత్ శర్మ కెప్టెన్సీపై అభిమానుల గుస్సా..!

– సోషల్ మీడియాలో దారుణంగా ట్రోలింగ్

భారత కెప్టెన్ రోహిత్ శర్మ కెప్టెన్సీపై మరోసారి చర్చ సాగుతున్నది. పేలవమైన కెప్టెన్సీపై సోషల్ మీడియా వేదికగా మరోసారి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో రోహిత్ కెప్టెన్సీపై విమర్శలు గుప్పిస్తున్నారు. మూడో టెస్ట్ రెండురోజు తొలి సెషన్‌లోనే టీమిండియా శుభారంభం చేసింది. తొలి సెషన్‌లోనే మూడు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా. అయితే, ఆ తర్వాత ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఈ క్రమంలోనే ఇద్దరు సెంచరీలు సాధించారు. ఆస్ట్రేలియా స్కోరు 317 వద్ద నాలుగో దెబ్బకు తగిలింది. స్టీవ్ స్మిత్ పెవిలియన్‌కు చేరాడు. 75 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియాను స్మిత్-హెడ్ జోడీ 317 పరుగుల వరకు తీసుకెళ్లారు. నాలుగో వికెట్‌కు 242 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. భారత్‌తో టెస్టులో ఆస్ట్రేలియాకు ఇది నాలుగో అత్యుత్తమ భాగస్వామ్యం కావడం విశేషం. స్మిత్, హెడ్ ఇద్దరూ కలిసి



టీమిండియా బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. ఈ క్రమంలో రోహిత్ శర్మ స్మిత్ ఇచ్చిన ఓ క్యాచ్‌ను సైతం మిస్ చేశాడు. నాలుగో వికెట్‌కు ఈ జోడీ భాగస్వామ్యం నెలకొల్పిన నేపథ్యంలో టీమిండియా అభిమానులు హిట్ మ్యాన్ కెప్టెన్సీపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న రోహిత్ నిర్ణయాన్ని సైతం అభిమానులు విమర్శించారు. అదే సమయంలో మ్యాచ్‌లో రోహిత్ అనుసరించిన వ్యూహాలపై సైతం విమర్శలు గుర్పించారు. స్మిత్, ట్రావిస్ హెడ్ బ్యాటింగ్ సమయంలోనూ సరిగ్గా ఫీల్డింగ్ సెట్ చేకపోవడంతో పరిస్థితిని ఇద్దరూ బ్యాటర్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారని విమర్శించారు. అభిమానులతో పాటు మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి సైతం రోహిత్ కెప్టెన్సీపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హెడ్ బ్యాటింగ్ సమయంలో అల్ట్రా డిఫెన్సివ్ ఫీల్డ్‌ని సెట్ చేశాడని.. అది పేలవంగా ఉందంటూ విమర్శించారు.

# వుమెన్స్ ప్రీమియర్ లీగ్ వేలంలో జాక్‌పాట్ కొట్టిన సిమ్రాన్..!

16 ఏళ్ల తమిళనాడు వికెట్ కీపర్‌పై కాసుల వర్షం..

వుమెన్స్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ కోసం బెంగళూరు వేదికగా ఆదివారం మినీ వేలం నిర్వహించారు. ఐదు జట్లు ఈ వేలంలో పాల్గొని 19 మందిని కొనుగోలు చేశాయి. ఇందు కోసం ఫ్రాంచైజీలు రూ.9.05కోట్లను వెచ్చించాయి. నలుగురు క్రికెటర్లపై ఫ్రాంచైజీలు కోట్లు కుమ్మరించాయి. ఈ వేలంలో భారత అన్‌క్యాప్డ్ బ్యాట్‌వుమెన్ సిమ్రాన్ షేక్ జాక్‌పాట్ కొట్టింది. వేలంలో సిమ్రాన్ బేస్‌పై గుజరాత్ జట్టు కోట్లు కుమ్మరించింది. రూ.1.90కోట్లకు గుజరాత్ జెయింట్స్ జట్టు కొనుగోలు చేసింది. రూ.10 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన సిమ్రాన్ బేస్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్ పోటీపడ్డాయి. ఇక భారత్‌కు




చెందిన 16 సంవత్సరాల జీ కమిలిని సైతం రికార్డు ధర దక్కింది. రూ.10లక్షల బేస్ ప్రైజ్‌తో వేలంలోకి వచ్చిన కమలినికి రూ.1.60కోట్లకు ముంబయి ఇండియన్స్ దక్కించుకుంది. కమలిని తమిళనాడు జట్టు కీపర్.యువ క్రీడాకారిణి కోసం ఢిల్లీ సైతం వేలంలో పోటీపడగా.. ధర భారీగా పెరిగింది. అక్టోబర్‌లో జరిగిన అండర్-19 మహిళల టీ20 ట్రోఫీలో కమలిని అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నది. ఎనిమిది మ్యాచుల్లో 311 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. అదే సమయంలోనూ పార్ట్ టైమ్ స్పిన్నర్‌గాను సత్తాచాటగా.. వేలంలో ధర భారీగా పలికింది. ఇక వెస్టిండిస్ ఆల్‌రౌండ్ డియాండ్రా డాటిన్‌ను రూ. 1.75 కోట్లకు గుజరాత్ జెయింట్స్ కొనుగోలు చేసింది. రూ.50లక్షల బేస్ ప్రైస్‌తో వేలంలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ ఆల్‌రౌండర్ కోసం గుజరాత్, యూపీ పోటీపడగా.. చివరకు గుజరాత్ భారీ ధరకు తీసుకున్నది. అలాగే, భారత స్టార్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ అమ్ముడవలేదు. రూ.30 లక్షల బేస్‌ప్రైజ్‌తో వేలంలో ఎంట్రీ ఇవ్వగా.. ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. అలాగే, ఇంగ్లండ్ కెప్టెన్ హీథర్ నైట్, టీమిండియా క్రీడాకారిణి, స్నేహ రాణాను సైతం ఫ్రాంచైజీలు తీసుకునేందుకు ఇష్టపడలేదు.

## స్పోర్ట్స్

## కేకేఆర్ అదృష్టాన్ని మార్చిన గౌతమ్ గంభీర్..

ఫలించిన పదేళ్ల నిరీక్షణ..!



టీమిండియాతో పాటు ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు 2024 సంవత్సరం చాలా ప్రత్యేకంగా నిలిచింది. శ్రేయాస్ అయ్యర్ నాయకత్వంలోని జట్టు మూడోసారి ఐపీఎల్ టైటిల్‌ని నెగ్గింది. దాదాపు పది సంవత్సరాల తర్వాత మరోసారి కప్‌ని సాధించింది. ఫైనల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై కేకేఆర్ జట్టు ఘన విజయం సాధించింది. కేకేఆర్ టైటిల్‌ని నెగ్గడంలో మెంటార్ గౌతమ్ గంభీర్ సైతం కీలక పాత్ర పోషించాడు. కేకేఆర్ చివరిసారిగా 2014లో విజేతగా నిలువగా.. మళ్లీ కప్ గెలిచేందుకు పదేళ్లు పట్టింది.

### గంభీర్ కెప్టెన్సీలోనే రెండు టైటిల్స్..

కోల్‌కతా నైట్‌రైడ్స్ ఇప్పటి వరకు మూడుసార్లు ఐపీఎల్ టైటిల్‌ను నెగ్గింది. ఈ ఏడాదితో పాటు 2012, 2014లో ట్రోఫీని గెలిచింది. ఆ సమయంలో కేకేర్ జట్టు కెప్టెన్‌గా గౌతమ్ గంభీర్ ఉన్నాడు. గంభీర్ రిటైర్‌మెంట్ అనంతరం కేకేఆర్ టైలిల్‌ను గెలిచేందుకు చాలాకాలమే నిరీక్షించాల్సి వచ్చింది. కానీ, ఈ సీజన్‌లో కోల్‌కతా మెంటార్‌గా మారడంతో చాంఫియన్‌గా అవతరించింది. కోల్‌కతా జట్టు 2021 సీజన్‌లో ఫైనల్‌కు చేరినా.. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు చేతిలో ఓటమిపాలైంది.

### కేకేఆర్‌కు అదృష్టంగా గంభీర్

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ యాజమాన్యంలోని కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రారంభం నుంచే లీగ్‌లో ఉన్నది. తొలిసారిగా టైటిల్‌ను నెగ్గేందుకు నాలుగేళ్ల సమయం పట్టింది. 2011 సీజన్‌లో వేలంలో గంభీర్‌ను తీసుకొని కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించింది. ఆ సీజన్‌లో కేకేఆర్‌లో చాలామంది ఆటగాళ్లు మారిపోయారు. గంభీర్ ఆ తర్వాత తనకు ఇష్టమైన రీతిలో టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఆ జట్టు తొలిసారిగా ప్లే ఆఫ్‌కు చేరుకుంది. ఆ సీజన్‌లో కేకేఆర్ నాలుగో స్థానంలో నిలిచింది. 2012 సీజన్‌లో మరోసారి గంభీర్ నాయకత్వంలో జట్టు వచ్చింది. ఆ సీజన్‌లో గంభీర్ బ్యాట్‌తో రాణించాడు.


తరంగాలు
Tharangalu Daily News Paper

# పెళ్లి తర్వాత ఫస్ట్ సినిమాను అనౌన్స్ చేసిన మెగా కోడలు..

## సతీలీలావతిగా లావణ్య.. హీరో ఎవరంటే?



వైవిధ్యమైన పాత్రలతో కథానాయికగా తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్ లావణ్య త్రిపాఠి. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న సినిమా 'సతీ లీలావతి'. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాల సంయుక్త నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నెం.1గా ఈ సినిమా రూపొందనుంది. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి)తదితర విభిన్న చిత్రాల దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వంలో నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఆదివారం (డిసెంబర్ 15),లావణ్య పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేసిన చిత్ర యూనిట్, ఆమెకు జన్మదిన శుభాకాంక్షలను తెలియజేసింది. 'సతీ లీలావతి' చిత్రంతో మరోసారి డిఫరెంట్ రోల్, ఎగ్జయిటింగ్ కథాంశంతో మెప్పించటానికి లావణ్య త్రిపాఠి సిద్ధమయ్యారు. త్వరలోనే ఈ మూవీ షూటింగ్ ప్రారంభం కానుంది. మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని నిర్మాతలు తెలిపారు. మిక్కీ జె.మేయర్ ఈ చిత్రానికి సంగీత సారథ్యం వహిస్తుండగా, బినేంద్ర మీనన్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేస్తున్నారు. ఉదయ్ పొట్టిపాడు మాటలు అందిస్తుండగా.. కోసనం విఠల్ ఆర్ట్ డైరెక్టర్‌గా, సతీష్ సూర్య ఎడిటర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కాగా సతీ లీలావతి సినిమా హీరో,ఇతర క్యాస్టింగ్స్ వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు మేకర్స్.కాగా గతేడాది మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌తో కలిసి వైవాహిక బంధంలోకి అడుగుపెట్టింది లావణ్య. ఆ తర్వాత సుమారు ఏడాదిపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. దీంతో లావణ్య సినిమాలకు గుడ్‌బై చెప్పేసిందంటూ కూడా నెట్టింట ప్రచారం జరిగింది. అయితే ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా కొత్త చిత్రాన్ని ప్రకటించి అందరినీ ఆశ్చర్య పరిచింది. కాగా ఈ సినిమాతో కొణిదెల లావణ్య త్రిపాఠి అని తొలిసారి టైటిల్ కార్డ్ ఉపయోగించడం విశేషం.




# విడుదల తేదీ ప్రకటించిన అనుష్క 'ఘాటి'.. రిలీజ్ ఎప్పుడంటే.?

అగ్ర కథానాయిక అనుష్క శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఘాటి . ఈ సినిమాకు వేదం, కంచె చిత్రాల దర్శకుడు జాగర్లమూడి కృష్ణ (క్రిష్) దర్శకత్వం వహిస్తున్నాడు. 4 ఏండ్ల నుంచి షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అనుష్క పుట్టినరోజు సందర్భంగా ఆమెకి శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ మూవీని సమ్మర్ కానుకగా ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా స్పెషల్ వీడియోను వదిలింది ఈ సినిమాలో అనుష్క ట్రైబల్ అమ్మాయి పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. భారతదేశంలోని కొండ లోయలలో నివసించే జీవితాల ఆధారంగా ఈ సినిమా రానుంది. ఇందులో అనుష్క ఒక బాధితురాలి నుంచి క్రిమినల్‌గా, అనంతరం లెజెండ్‌గా ఎలా మారింది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే అంటూ మేకర్స్ తెలిపారు. ఇక కొండపోలం వంటి భారీ డిజాస్టర్ తర్వాత క్రిష్ దర్శకత్వంలో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్ తెరకెక్కిస్తుంది. ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.




# ప్రభాస్ సరసన మరాఠి ముద్దుగుమ్మ..

అర్జున్ రెడ్డి, యామిమల్ వంటి హిట్ చిత్రాలతో ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. ఈ రెండు సినిమాలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ తో ఓ ప్రాజెక్ట్ చేయనున్నారు. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా లెవల్లో రూపొందించనున్న ఈ చిత్రానికి స్పిరిట్ అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు ఇదివరకు చిత్రయూనిట్ ప్రకటించింది. ఇందులో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటివరకు సందీప్ రెడ్డి తెరకెక్కించిన చిత్రాలకు ఈ సినిమా విభిన్నంగా ఉంటుందని ముందు నుంచి టాక్ నడుస్తుంది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే స్పిరిట్ మూవీ గురించి నిత్యం ఏదోక న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. తాజాగా ఈ చిత్రం గురించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వినిపిస్తుంది. స్పిరిట్ చిత్రంలో మరాఠి, బాలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ డమ్ అందుకున్న ఓ హీరోయిన్ నటించనుందట. ఈ అమ్మడుకు తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. 2025లో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమాకు నటీనటుస ఎంపిక జరుగుతుంది. నివేదికల ప్రకారం ఈ సినిమాలో కథానాయికగా మృణాల్ ఠాకూర్ ను ఎంపిక చేశారని ప్రచారం జరుగుతుంది. ఈ సినిమాలో కరీనా కపూర్, సైఫ్ అలీ ఖాన్ కీలకపాత్రలలో కనిపించనున్నారట. వీరిద్దరిది నెగిటివ్ రోల్స్ ఉంటాయని టాక్ వినిపిస్తుంది. ఇక ఇప్పుడు ఈ సినిమాకు హీరోయిన్ గా మృణాల్ ను ఎంపిక చేశారనే టాక్ నడుస్తుంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి క్లారిటీ రాలేదు.



# 10 రోజుల్లో రూ.500 కోట్లు..
# బాలీవుడ్‌లో బీభత్సం సృష్టిస్తున్న 'పుష్ప 2'

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన క్రేజీ సీక్వెల్ పుష్ప 2 ది రూల్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తుంది. ఈ సినిమా మొదటిరోజు నుంచే హిందీలో రికార్డులను నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. మొదటిరోజే హిందీలో షారుఖ్ ఖాన్ జవాన్ పేరిటా ఉన్న రికార్డును బద్దలుకొట్టిన పుష్పరాజ్ ఆ తర్వాత వరుసగా మూడు రోజులు రికార్డు కలెక్షన్లు సాధించాడు. ఇప్పటివరకు హిందీలో ఏ సినిమాకు కూడా సాధ్యం కానీ ఒక్క రోజుల్లో(రూ.86 కోట్ల కలెక్షన్స్) రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే తాజాగా ఈ చిత్రం మరో రికార్డును నమోదు చేసింది. కేవలం 10 రోజుల్లో బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద రూ.500 కోట్ల వసుళ్లను రాబట్టింది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**